JAYABHERIDAILY.COM

ప్రభాత

# జయభేరి

జాతీయ తెలుగు దినపత్రిక

ప్రజల పక్షాన అక్షర యజ్ఞం

ఎడిటర్ మోతె రఘు తిరుపతి రెడ్డి

మేడ్చల్ - మల్కాజిగిరి । శుక్రవారం 17-07-2026

Medchal - Malkajgiri । Friday 17-07-2026

Follow: jayabherinews

సంపుటి : 03 । సంచిక : 46

పేజీలు : 8 । వెల : 5

Vol. 03 । Issue 46 । Pages : 8 । ₹: 5

విలేకర్లు కావలెను

మీకు జర్నలిజంలో ఆసక్తి ఉందా?

సమస్యల్ని ప్రశ్నించేందుకు సరైన అస్త్రం కోసం ఎదురు చూస్తున్నారా?

మీకు అవకాశం కల్పించేందుకు మేము సిద్ధంగా ఉన్నాం..!

ప్రభుత్వానికి ప్రజలకి మధ్య వారధిగా ఉంటూ..

డిజిటల్ మీడియా రంగంలో సరికొత్త హంగులతో మీ అరచేతిలో...

"జయభేరి" తెలుగు దినపత్రిక.. నీకో చక్కని వేదికగా నిలుస్తుంది...

9391 544 889 call me

jayabheripaper@gmail.com





# గోల్కొండ కోటలో ఘనంగా బోనాల జాతర

**మహంకాళి అమ్మవారికి బంగారు బోనం**

**అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించిన మంత్రులు**

**బోనాల పండుగకు భద్రత కట్టుదిట్టం**

**తెలంగాణా ఆత్మను చాటే మహోత్సవం అన్న గవర్నర్**

జయభేరి, హైదరాబాద్ :

తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక అయిన ఆషాఢమాస బోనాల జాతర గోల్కొండ కోటపై అత్యంత ఘనంగా ప్రారంభమైంది. ఆషాఢ మాసం సందర్భంగా ఎప్పటి నుంచో వస్తున్న ఆనవాయితీలో భాగంగా కుమ్మర్లు జగదాంబ మహంకాళి అమ్మవారికి 11 బోనాలతో కూడిన తొలిబోనాన్ని సమర్పించారు. రాష్ట్రప్రభుత్వం తరపున లంగర్‌హౌస్ నుండి బంగారు బోనం అత్యంత భక్తి శ్రద్ధలతో సమర్పించారు. డప్పు చప్పుళ్ళు, పోతరాజుల విన్యాసాలు, శివసత్తుల పూనకాలతో బోనాల పండుగ ఘనంగా జరుగుతుంది.

...మిగతాది 2 లో

# మోదీ కొత్త చరిత్ర

- **విపక్షాలు కుదేల్, ఒక్క నిర్ణయంతో సీన్ ఛేంజ్..!!**
- **పార్లమెంటు సమావేశాలు.. మహిళా రిజర్వేషన్ బిల్లు కోసం బీజేపీ ప్రయత్నాలు**



జయభేరి, న్యూఢిల్లీ :

జాతీయ రాజకీయాల్లో కీలక మలుపు. ఎక్కడైతే బలం లేదని వెనుకడుగు వేసారో.. ఇప్పుడు అక్కడే అనుకున్నది సాధిస్తున్నారు. చెప్పిన సమయానికి చెప్పినట్లుగా అనుకున్నది పూర్తి చేస్తున్నారు. ఇందుకు ప్రధాని మోదీ షా ద్వయం పూర్తి రంగం సిద్ధం చేసారు. విపక్షాలు తమదే పై చేయి అనుకుంటున్న వేళ.. ఊహించని షాక్ తో కుదేలు అవుతున్నాయి. ఈ నిర్ణయం మొత్తం రాజకీయ ముఖ చిత్రాన్నే మార్చేస్తుంది. ఇందుకు ముహూర్తం ఖరారైంది. పార్లమెంట్ వేదికగా కొత్త చరిత్ర లిఖించేందుకు రంగం సిద్ధమైంది. ప్రధాని మోదీ షా మార్క్ రాజకీయం విపక్షాలకు ఊహించని

...మిగతాది 2 లో



# నేడు తెలంగాణ కేబినెట్ భేటీ

- **కరవు పరిస్థితులు, కాళేశ్వరం, మూసీ పునరుజ్జీవనం, సాగునీటి ప్రాజెక్టులు అలాగే కీలక బిల్లులపై చర్చించనుంది**

హైదరాబాద్, జూలై 16:

తెలంగాణ కేబినెట్ సమావేశం జూలై 17 న జరగనుంది. సీఎం రేవంత్ రెడ్డి అధ్యక్షతన సచివాలయంలోని 6వ అంతస్తులో మధ్యాహ్నం 3 గంటలకు కేబినెట్ అత్యవసరంగా భేటీ కానుంది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు అధికారిక ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సమావేశంలో కరవు పరిస్థితులు, కాళేశ్వరం, మూసీ పునరుజ్జీవనం, సాగునీటి ప్రాజెక్టులు అలాగే కీలక బిల్లులపై చర్చించనుంది. ముఖ్యంగా కొన్ని ప్రాజెక్టుల రీఎస్టిమేషన్స్ ప్రతిపాదనలకు మంత్రివర్గం ఆమోదం తెలిపే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

రాష్ట్రంలో భూగర్భ జలాలు అడుగంటిపోతుండటంపై సమీక్షించనున్నారు. కరవును తట్టుకునేలా రైతులకు ప్రత్యామ్నాయ పంటల సాగును ఎలా ప్రోత్సహించాలనే అంశంపై మంత్రివర్గం సుదీర్ఘంగా చర్చించే అవకాశం ఉంది. వీటితోపాటు గోదావరి బనకచర్ల ప్రాజెక్టు, కృష్ణా, గోదావరి నదీ జలాల బోర్డుల అంశాలు, తుమ్మిడి హట్టి ప్రాజెక్ట్ పై చర్చించనున్నారు.

అలాగే రాష్ట్రంలో సరికొత్త 'మున్సిపల్ చట్టాన్ని' ప్రవేశపెట్టేందుకు రేవంత్ సర్కార్ కసరత్తులు చేస్తోంది. ఈ నూతన మున్సిపల్ చట్టం ముసాయిదాపై కేబినెట్ లో చర్చించి.. దీనికి మంత్రివర్గ ఆమోద ముద్ర వేసే అవకాశం ఉంది. ఈ కీలక మార్పులతో పాటు రాష్ట్రానికి సంబంధించిన పలు ఇతర అభివృద్ధి సంక్షేమ పథకాలపై కేబినెట్ కీలక నిర్ణయాలు తీసుకోనుంది.

# హరీష్ వ్యూహాత్మక మౌనమేనా..



6 లో

# తుర్కపల్లిలో నకిలీ కరెన్సీ



- **ముగ్గురు మోసగాళ్లు అరెస్ట్**

యాదాద్రి భువనగిరి, జులై 16:

పదివేల నగదు రెండు మోటార్ సైకిళ్ళు మూడు సెల్ ఫోన్లు స్వాధీనం పిల్లల ఆట కరెన్సీ నోట్లతో రూ.1 లక్షకు రూ.2 లక్షలు ఇస్తామని మోసం యాదాద్రి భువనగిరి జిల్లా పోలీసుల చాకచక్యంతో కేసు ఛేదన సులభంగా డబ్బు వస్తుందంటే మోసపోవద్దు. యాదాద్రి భువనగిరి జిల్లా బ్యూరో జూలై 15 సూర్య న్యూస్ పిల్లలు ఆడుకునే కరెన్సీ నోట్లతో లక్షకు రెండు లక్షలు ఇస్తామని మోసం చేసిన ముగ్గురు నిందితులను యాదాద్రి భువనగిరి జిల్లా పోలీసులు బుధవారం అరెస్టు చేశారు. నిందితుల నుండి పదివేల రూపాయల నగదు, రెండు మోటర్ సైకిళ్లు, మూడు మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల తెలిపిన వివరాల ప్రకారం, యాదాద్రి భువనగిరి జిల్లా పోలీసు సూపరింటెండెంట్ అక్షాన్స్ యాదవ్ ఆదేశాలు, పర్యవేక్షణలో తుర్కపల్లి పోలీసులు వేగంగా స్పందించి, పిల్లల ఆట కరెన్సీ నోట్లను ఉపయోగించి అమాయక ప్రజలను మోసం చేస్తున్న ముగ్గురు నిందితులను అరెస్టు చేసి, వారి వద్ద నుండి నేరానికి సంబంధించిన వస్తువులను స్వాధీనం చేసుకున్నారు. తుర్కపల్లికి మండలానికి చెందిన ఒక వ్యక్తిని నిందితులు సంప్రదించి, రూ.1,00,000 ఇస్తే రూ.2,00,000 నగదు ఇస్తామని ఆశ చూపి నమ్మించారు. వారి మాటలు నమ్మిన బాధితుడు పల్లెపహాడ్ స్టేజ్ సమీపంలో రూ.1,00,000 నగదును వారికి అప్పగించారు. అనంతరం నిందితులు ఇచ్చిన కరెన్సీ కట్టలను పరిశీలించగా, పైన, కింద మాత్రమే అసలైన రూ.500 నోట్లు ఉంచి, మధ్యలో చిల్డ్రన్స్ బ్యాంక్ ఆఫ్ ఇండియా స్పెషమెన్ అని ముద్రించిన పిల్లల ఆట కరెన్సీ నోట్లను

...మిగతాది 2 లో

# సైబర్ నేరాలే అతిపెద్ద సవాలు

- **సైబర్ నేరాలను నియంత్రించకపోతే తీవ్ర ఇబ్బందులు తప్పవు**
- **తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో పనితీరుపై డీజీపీ సమగ్ర సమీక్ష**
- **AI ఆధారిత కాల్ సెంటర్, సైబర్ ల్యాబ్‌లు, సెక్యూరిటీ ఆపరేషన్స్ సెంటర్, డిజిటల్ ఫోరెన్సిక్ విభాగాలను పరిశీలించిన డీజీపీ**
- **సాంకేతికతను పూర్తిస్థాయిలో వినియోగించి దేశంలోనే అగ్రస్థానంలో నిలవాలి**




హైదరాబాద్, జూలై 16:

తెలంగాణలో సైబర్ నేరాల నియంత్రణ, బాధితులకు వేగవంతమైన సేవలు, సాంకేతిక సామర్థ్యాల పెంపు లక్ష్యంగా తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో చేపడుతున్న కార్యక్రమాలపై రాష్ట్ర డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ (డీజీపీ) సి.వి. ఆనంద్, సమగ్ర సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరోలోని సైబర్ ల్యాబ్, సెక్యూరిటీ ఆపరేషన్స్ సెంటర్ (SOC),

...మిగతాది 2 లో




2 లో

# అమరావతిలో జగన్నాథ రథయాత్ర

- **చంద్రబాబు ఏం కోరుకున్నారంటే?**

విజయవాడ, జూలై 16 :

అమరావతి రాజధానిలో జగన్నాథుడి రథయాత్ర ను సీఎం చంద్రబాబు ఇవాళ అట్టహాసంగా ప్రారంభించారు. రాజధానిలోని వెంకటపాలెం నుంచి రథయాత్రను సీఎం ప్రారంభించారు. పూరీ క్షేత్రంలో నిర్వహించే సంప్రదాయ క్రతువులను అనుసరిస్తూ జగన్నాథ, బలభద్ర, సుభద్రలతో కూడిన రథం ముందు చంద్రబాబు బంగారు చీపురుతో ఊడ్చి శుభ్రం చేసి స్వామివారి రథ యాత్రను తాడుతో లాగి ప్రారంభించారు. రోజువారీ జీవితంలో ఒత్తిడి తగ్గించే అత్యుత్తమ మంత్రం ఆధ్యాత్మికత ఒక్కటేనని చంద్రబాబు తెలిపారు.



# పసిపిల్లలపై మతపరమైన రుద్దుళ్లా..

2 లో

- **సైదాబాద్ స్కూల్ నిర్వాకం పై కేంద్రమంత్రి కిషన్ రెడ్డి ఫైర్**

హోంవర్క్ పేరుతో క్లాస్2 హిందూ విద్యార్థి చేత కల్మా చదివించేందుకు ప్రయత్నించిన ఉదంతం హైదరాబాద్‌లో తీవ్ర వివాదాస్పదంగా మారింది. స్కూల్ నిర్వాకంపై కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. అమాయక చిన్నారుల మనసుల్లో మతపరమైన ఆలోచనలను జొప్పించేందుకు జరుగుతున్న బహిరంగ కుట్ర ఇదని ఆయన ఆరోపించారు.

మొదటిపేజీ తరువాయి

## ఘనంగా బోనాల జాతర

**అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించిన మంత్రులు**

అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్, మంత్రులు పొన్నం ప్రభాకర్, కొండా సురేఖ అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించారు. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రత్యేక పూజలలో వారు పాల్గొన్నారు . వారు ప్రజలంతా ఆయురారోగ్యాలతో, పాడి పంటలతో సుభిక్షంగా ఉండాలని కోరుకున్నారు. నేడు గోల్కొండ కోట పరిసరాలన్నీ భక్తుల రద్దీతో శోభాయమానంగా మారాయి. కోట వైపు వచ్చే దారులు అన్నీ భక్త జన సందోహంతో కిటకిటలాడాయి.

**బోనాల పండుగకు భద్రత కట్టుదిట్టం**

భక్తుల రద్దీ దృష్ట్యా చైన్ స్నాచింగ్స్, పిక్‌పాకెటింగ్ నివారణకు హైదరాబాద్ పోలీసులు మోస్ట్ వాంటెడ్ నేరగాళ్ల ఫొటోలతో కూడిన ప్రత్యేక బ్యానర్లను ఏర్పాటు చేసి భద్రతను కట్టుదిట్టం చేశారు. భక్తులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఆషాడ మాసం బోనాలు నేటినుంచి ప్రారంభమైన సందర్భంగా గవర్నర్ శివప్రతాప్ శుక్లా, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ శుభాకాంక్షలు తెలియజేశారు.

**తెలంగాణా ఆత్మను చాటే మహోత్సవం అన్న గవర్నర్**

బోనాలు తెలంగాణ ఆత్మను చాటే మహోత్సవమని, ఇది కేవలం పండుగ మాత్రమే కాదని, ప్రజల విశ్వాసానికి ప్రతీక అని గవర్నర్ పేర్కొన్నారు. అమ్మవారి ఆశీస్సులతో రాష్ట్ర ప్రజలకు సుఖశాంతులు కలగాలని ఆకాంక్షించారు. జంట నగరాల్లో జరిగే ఈ వేడుకలు రాష్ట్ర గంగాజమున తహజీబ్‌కు, లౌకిక స్ఫూర్తికి నిదర్శనమని ముఖ్యమంత్రి అన్నారు. 3 వేలకు పైగా ఆలయాలలో ప్రభుత్వం ఘనంగా బోనాల పండుగ ఏర్పాట్లు భక్తుల సౌకర్యార్థం హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్‌మల్కాజిగిరి జిల్లాల పరిధిలోని 3 వేలకు పైగా ఆలయాలలో ప్రభుత్వం ఘనంగా బోనాల జాతరకు ఏర్పాట్లు చేసిందని, ఇందుకోసం 20 కోట్ల రూపాయలు మంజూరు చేసినట్లు ముఖ్యమంత్రి వెల్లడించారు.

## మోదీ కొత్త చరిత్ర

షాక్ గా మారుతోంది. ఈ నెల 20 నుంచి ప్రారంభం కానున్న పార్లమెంట్ సమావేశాల్లో కీలక బిల్లుల ఆమోదానికి ప్రణాళికలు సిద్ధం అయ్యాయి. ఏప్రిల్ లో ప్రవేశ పెట్టిన మహిళా రిజర్వేషన్ డీలిమిటేషన్ బిల్లు కు అనుకూలంగా 298 ఓట్లు, వ్యతిరేకంగా 230 ఓట్లు వచ్చాయి. సభకు హాజరై ఓటు వేసిన సభ్యులలో రాజ్యాంగపరంగా అవసరమైన మూడింట రెండు వంతుల మెజారిటీకి దూరంగా నిలిచింది. ఇప్పుడు తిరిగి ఈ బిల్లు ఆమోదం పొందాలంటే ప్రస్తుతం లోక్‌సభలో 540 మంది సభ్యులు ఉన్నారు. ఏదైనా రాజ్యాంగ సవరణకు కనీసం 360 మంది ఎంపీల మద్దతు లేదా మూడింట రెండు వంతుల మెజారిటీ అవసరం. ప్రస్తుతం, ఎన్‌డిఏ కు 298 మంది ఎంపీల మద్దతు ఉంది. కాగా, తిరుగుబాటు చేసిన 20 మంది తృణమూల్ ఎంపీలు 'నేషనలిస్ట్ సిటిజన్స్ పార్టీ ఆఫ్ ఇండియా' (NCPI)లో విలీనం కాగా, ఉద్ధవ్ థాకరే నేతృత్వంలోని శివసేనకు చెందిన ఆరుగురు ఎంపీలు ఏక్‌నాథ్ షిండే శివసేనలో చేరారు. దీనితో ఎన్‌డిఏ బలం 324కు పెరుగింది. పార్లమెంట్ లో బిల్లుల ఆమోదానికి తుది కసరత్తు కాగా, అవసరమైన మెజారిటీకి ఇది ఇంకా 36 ఓట్ల దూరంలోనే ఉంటుంది. DMK కు చెందిన 22 మంది ఎంపీలు, శరద్ పవార్ నేతృత్వంలోని ఎన్సీపీకి చెందిన ఎనిమిది మంది ఎంపీలు ప్రభుత్వానికి మద్దతు ఇచ్చే అవకాశం ఉందనే రాజకీయ ఊహాగానాలు కూడా ఉన్నాయి. ఒకవేళ అలా జరిగితే, ఎన్‌డిఏ సంఖ్యాబలం 354కు చేరుకోవచ్చు. అప్పుడు మూడింట రెండు వంతుల మెజారిటీ మార్కుకు ఆరు ఓట్ల దూరంలోనే ఉండిపోతుంది. అటువంటి పరిస్థితుల్లో, చిన్న పార్టీలు మరియు స్వతంత్ర ఎంపీల పాత్ర కీలకం అయ్యే అవకాశం ఉంటుంది. ఇదే సమయంలో డీలిమిటేషన్ విషయంలో అన్ని రాష్ట్రాలకు సమాన న్యాయం జరిగేలా లోక్‌సభ సీట్లను 50 శాతం వరకు పెంచితే తమ పార్టీ సానుకూలంగా ఆలోచన చేస్తుందని సుప్రియా సూలే ఇచ్చిన సంకేతాలు కీలకంగా మారాయి. దీంతో.. ప్రధాని మోదీ షా తాము అనుకున్న విధంగా పార్లమెంట్ వేదికగా ఈ బిల్లులను అదే విపక్షాల ముందు ఆమోదించేలా చేస్తున్న కసరత్తు తుది దశకు చేరుకుంది. ఈ బిల్లులు ఆమోదం పొందితే రాజకీయ ముఖచిత్రం పూర్తిగా మారిపోనుంది.

## అమరావతిలో జగన్నాథ రథయాత్ర

సమాజాన్ని ప్రశాంతంగా ఉంచే క్షేత్రాలు మన దేవాలయాలన్నారు. సమాజంలో మానవ సంబంధాలు తగ్గి సామాజిక మాధ్యమాల ప్రతికూల ప్రభావం పడుతోందన్నారు. అందుకే కొన్ని కుటుంబాల్లో ఆత్మహత్యలు, చిన్నారులపై అఘాయిత్యాల లాంటి ఘటనలు చోటు చేసుకుంటున్నాయని వ్యాఖ్యానించారు. అందరి జీవితాల్లో ఒత్తిడి దూరమై మానసిక ప్రశాంతత చేకూరేందుకు ఆధ్యాత్మికతే మార్గమన్నారు. అందుకే రాష్ట్రంలో 5 వేల శ్రీవారి ఆలయాలు నిర్మిస్తున్నట్లు తెలిపారు. అమరావతి రాజధాని నగర బృహత్ ప్రణాళికతో కూడిన చిత్ర పటాన్ని శిరస్సుపై ధరించి విశ్వ నగరిగా అమరావతి ఎదగాలని చంద్రబాబు జగన్నాథుడిని కోరుకున్నారు. భారతీయ సంస్కృతిలో భాగమైన ఉమ్మడి కుటుంబాలు రావాలని, మైక్రో ఫ్యామిలీలు కాదని చంద్రబాబు తెలిపారు. పూరీ క్షేత్రంలో నిర్వహించే జగన్నాథ రథ యాత్రకు ఎంతో ప్రత్యేకత ఉందని.. అలాంటి రథ యాత్రను అమరావతిలో తొలిసారి నిర్వహించటంపై ఆయన సంతోషం వ్యక్తంచేశారు. ప్రతీ ఏటా జగన్నాథ రథ యాత్ర కార్యక్రమాన్ని నిర్వహిస్తామని ఇస్కాన్ సంస్థ ప్రకటించిందన్నారు.

## సైబర్ నేరాలే అతిపెద్ద సవాలు

సెంట్రల్ మానిటరింగ్ యూనిట్, సోషల్ మీడియా యూనిట్, చైల్డ్ ప్రొటెక్షన్ యూనిట్, డిజిటల్ ఫోరెన్సిక్ యూనిట్ తదితర విభాగాలను సందర్శించి వాటి పనితీరు, సాంకేతిక సామర్థ్యాలు, దర్యాప్తు విధానాలు, ఆధునిక సాంకేతికత వినియోగాన్ని సమీక్షించారు. ఈ సందర్భంగా తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో డైరెక్టర్ శ్రీమతి శిఖా గోయల్, ఐపీఎస్ తో పాటు అధికారులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా సైబర్ నేరాల తాజా ధోరణులు, దర్యాప్తు విధానాలు, కృత్రిమ మేధస్సు (AI) వినియోగం, బాధితులకు అందిస్తున్న సేవలు, భవిష్యత్ కార్యాచరణపై డీజీపీకి వివరించారు. సమీక్షలో భాగంగా డీజీపీ స్వయంగా AI ఆధారిత సైబర్ కాల్ సెంటర్ పనితీరును పరిశీలించారు. "నేను సైబర్ మోసంలో డబ్బులు కోల్పోయాను" అని బాధితురాలు చెప్పగానే AI వ్యవస్థ వెంటనే స్పందించి, ఆమెకు ధైర్యం చెబుతూ పేరు, ప్రాంతం, సమీప పోలీస్ స్టేషన్, సంఘటన వివరాలను సేకరించింది. అదే సమయంలో సంబంధిత పోలీస్ స్టేషన్‌కు ఆటోమేటిక్‌గా సమాచారం చేరే విధానాన్ని డీజీపీ పరిశీలించి అభినందించారు. ప్రజలకు మరింత వేగవంతమైన సేవలు అందించేందుకు AI ఆధారిత సేవలను విస్తరించాలని అధికారులకు సూచించారు.

**సైబర్ నేరాల నియంత్రణలో ఫలితాలు**

సమీక్ష సందర్భంగా అధికారులు వెల్లడించిన గణాంకాల ప్రకారం, 2025లో తెలంగాణలో సైబర్ నేరాల వల్ల రూ.1,524 కోట్ల ఆర్థిక నష్టం నమోదైనప్పటికీ, 2024తో పోలిస్తే ఆర్థిక నష్టాల్లో 20 శాతం తగ్గుదల నమోదైంది. అదే విధంగా సైబర్ ఫిర్యాదులు 91,369కు పరిమితమవడంతో ఫిర్యాదుల్లో కూడా 3 శాతం తగ్గుదల నమోదైంది. నేరస్తుల ఖాతాల్లోని నిధులను నిలిపివేసే POH మొత్తం రూ.255 కోట్ల నుంచి రూ.279 కోట్లకు పెరగగా, POH శాతం 9 శాతం నుంచి 12 శాతానికి పెరగడం బాధితుల సొమ్ము రక్షణలో తెలంగాణ సాధించిన పురోగతికి నిదర్శనమని అధికారులు వివరించారు. ఈ కార్యక్రమంలో డీజీపీ శ్రీ సి.వి. ఆనంద్, ఐపీ ఎస్ తో పాటు తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో డైరెక్టర్ శిఖా గోయల్, ఐపీఎస్, ఎస్పీలు హర్షవర్ధన్, సాయి శ్రీ, డీఎస్పీలు, సీఐలు, తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరోకు చెందిన ఇతర అధికారులు పాల్గొన్నారు.

## ఏళ్ల బాలికపై గ్యాంగ్ రేప్..

జయభేరి, భద్రాద్రి కొత్తగూడెం :

కొత్తగూడెంలో 14 ఏళ్ల మైనర్ బాలికపై గ్యాంగ్ రేప్ జరిగింది. నిందితులలో ఒక పోలీసు కానిస్టేబుల్ వున్నాడు. ప్రేమ పేరుతో ఒకరు భయపెట్టి మరో ఇద్దరు కామాంధులు బాలికపై లైంగిక దాడికి తెగబడ్డారు. ఈ విషయం బయటకు చెబుతామని బెదిరించి మరో ఇద్దరు అత్యాచారం చేసారు.

# అమెరికా యూ టర్న్..




రష్యా నుంచి చమురు కొనుగోలు చేసే దేశాలపై 500 శాతం సుంకాన్ని విధించాలనే ప్రతిపాదనలను అమెరికా కాస్త వెనక్కి తగ్గింది. ఇది భారత్, చైనాకు ఊరట కలిగించే అంశంగా విశ్లేషకులు భావిస్తున్నారు. అమెరికాలో ప్రవేశపెట్టిన రష్యా ఆంక్షల బిల్లును సవరించారు. ప్రతిపాదిత గరిష్ఠ సుంకాన్ని 500 శాతం నుంచి 100 శాతానికి తగ్గించింది. ఈ బిల్లు చట్టంగా మారితే, భారత్ వంటి ప్రధాన రష్యన్ చమురు దిగుమతిదారులకు మేలు జరగనుంది. ఇప్పటి వరకు ఎదుర్కొంటున్న ఆర్థిక ఒత్తిడి నుంచి ఉపశమనం కలగవచ్చు. రిపబ్లికన్ డెమోక్రటిక్ చట్టసభ సభ్యులు మంగళవారం రష్యా ఆంక్షల బిల్లు సవరించిన ప్రతిని ప్రవేశపెట్టారు. ఈ కొత్త ముసాయిదా, రష్యా నుంచి చమురు, గ్యాస్ కొనుగోలు చేసే దేశాలపై గరిష్ఠంగా 100 శాతం సుంకాన్ని విధించాలని ప్రతిపాదిస్తోంది. గతంలో, ఈ బిల్లు అటువంటి అన్ని దేశాలపై 500 శాతం సుంకాన్ని విధించాలని కోరింది.

అగ్రరాజ్యం అమెరికాకు డొనాల్డ్ ట్రంప్ అధ్యక్షుడు అయ్యాక భారత్‌కు మొదలైన కష్టాలు ఇంకా కొనసాగుతున్నాయి. ట్రంప్ తీసుకుంటున్న నిర్ణయాలతో భారత్ ఆర్థికంగా ఒడిదుడుకులు ఎదుర్కొటోంది. అమెరికా వెళ్లేవారు ఇబ్బంది పడుతన్నారు. ఇక ప్రతీకార సుంకాలు భారత వ్యాపార ఎగుమతులను దెబ్బతీస్తున్నాయి. ఇప్పటికే అనేక కారణాలతో దిగుబతులపై 25 శాతం నుంచి 50 శాతం వరకు సుంకాలు అమలు అవుతున్నాయి. తాజాగా రష్యాఉక్రెయిన్ యుద్ధాన్ని సాకుగా చూపి ట్రంప్ చట్ట సవరణ తీసుకురాబోతున్నారు. రష్యా నుంచి ముడి చమురు కొనుగోలు చేసే దేశాలపై విధించాలనుకున్న సుంకాల గరిష్ఠ పరిమితిని 500 శాతం నుంచి 100 శాతానికి తగ్గించారు. ఈ బిల్లు రష్యా నాయకులు, ఆర్థిక సంస్థలు, ఇంధన సంబంధిత ప్రాజెక్టులను నేరుగా లక్ష్యంగా చేసుకుంటుంది .ఈ చట్టం (శాంక్షనింగ్ రష్యా యాక్ట్)ను ఇటీవల మరణించిన సెనేటర్ లిండ్సే గ్రాహమ్ ప్రతిపాదించారు. దీని ద్వారా అధ్యక్షుడికి రష్యా నుంచి చమురు దిగుమతి చేసుకునే దేశాలపై అసాధారణ స్థాయిలో సుంకాలు విధించే అధికారం లభిస్తుంది. మొదట్లో దీనిని ఆర్థికంగా బలహీనపరిచే శక్తివంతమైన చర్యగా అభివర్ణించారు. మధ్యప్రాచ్యంలో ఉద్రిక్తతలు పెరగడంతో సుంకాల పరిమితిని 100 శాతానికి తగ్గించి సవరించారు. ఈ మార్పులకు ప్రభుత్వ, వ్యతిరేక పక్షాల నుంచి మద్దతు లభించింది. గ్రాహమ్ రష్యా నుంచి చమురు కొనుగోలు చేస్తున్న భారత్, చైనా, బ్రెజిల్ వంటి దేశాలు యుద్ధానికి పరోక్షంగా నిధులు సమకూరుస్తున్నాయని ఆరోపించారు. ఈ బిల్లు అమల్లోకి వస్తే ఆ దేశాలు రష్యా ఇంధనం కొనకుండా అడ్డుకుంటుందని ఆయన అభిప్రాయపడ్డారు. సవరించిన రూపంలో ఈ నిబంధనలు మిత్రరాజ్యాలకు అనుకూలంగా ఉన్నాయి. లక్ష్యంగా మారే దేశాల్లో చైనా, భారత్, స్లోవేకియా, హంగరీ, అజర్‌బైజాన్ ఉన్నాయి.రష్యా సహజ వాయువును దిగుమతి చేసుకునే ప్రధాన దేశాల్లో చైనా, ఫ్రాన్స్, జపాన్, హంగరీ, బెల్జియం ఉన్నాయి. రష్యా వాయువు ఎగుమతుల్లో 15 శాతం కంటే తక్కువ దిగుమతి చేసి, సరఫరాలను తగ్గించే చర్యలు తీసుకుంటున్న దేశాలకు ఈ బిల్లులో మినహాయింపులు ఇచ్చారు. ఇది జపాన్, ఫ్రాన్స్‌కు ప్రత్యేకంగా ప్రయోజనకరంగా ఉంటుంది.మధ్యప్రాచ్యంలో సంక్షోభం కారణంగా ప్రపంచవ్యాప్తంగా ముడి చమురు ధరలు మళ్లీ పెరుగుతున్నాయి. ఈ పరిస్థితిలో సరఫరాలో అంతరాయం కలగకుండా ఉండేందుకు అమెరికా రష్యా ఇంధనంపై మినహాయింపులు ఇచ్చింది. ప్రస్తుతం ఆ మినహాయింపులను తొలగించే యోచనలో ఉంది. ట్రంప్ పిచ్చి చేష్టలతో మళ్లీ చమురు సంక్షోభం నెలకొనే ప్రమాదం ఉంది.రష్యా నుంచి ముడి చమురును అత్యధికంగా కొనుగోలు చేసే దేశాల్లో భారత్, చైనా ఉన్నాయని అమెరికా భావిస్తోంది. సవరించిన బిల్లు ప్రకారం, రష్యా నుంచి అత్యధికంగా చమురు, సహజ వాయువును కొనుగోలు చేసే మొదటి ఐదు దేశాలకు మాత్రమే గరిష్ఠ సుంకాలు వర్తిస్తాయి. గతంలో, ఈ నిబంధన దిగుమతి చేసుకునే అన్ని దేశాలకు వర్తించేది.ఈ బిల్లును దివంగత రిపబ్లికన్ సెనేటర్ లిండ్సే గ్రాహం, డెమోక్రటిక్ సెనేటర్ రిచర్డ్ బ్లూమెంతల్ ప్రవేశపెట్టారు. సవరించిన ఈ బిల్లుకు రిపబ్లికన్,డెమోక్రటిక్ పార్టీల నుంచి కూడా మద్దతు లభిస్తోంది. సెనేట్ వర్గాల సమాచారం ప్రకారం, ప్రస్తుతం 26 మంది చట్టసభ్యులు ఈ బిల్లుకు సహప్రాయోజకులుగా ఉన్నారు. ఇది కాంగ్రెస్‌లో ముందుకు సాగే కొద్దీ మరింత మద్దతు పొందే అవకాశం ఉంది.ఈ ప్రతిపాదన ప్రస్తుతం అమెరికా కాంగ్రెస్‌లో పరిశీలనలో ఉంది. కాంగ్రెస్ ఆమోదం, అధ్యక్షుడి అంగీకారం లభించిన తర్వాతే ఇది చట్టంగా మారుతుంది. అందువల్ల, భారత్ సహా ఇతర దేశాలు ఈ బిల్లు పురోగతిని నిశితంగా గమనిస్తున్నాయి.

# పసిపిల్లలపై మతపరమైన రుద్దుళ్లా..









## సైదాబాద్ స్కూల్ నిర్వాకం పై కేంద్రమంత్రి కిషన్ రెడ్డి ఫైర్

జయభేరి, హైదరాబాద్ :

హైదరాబాద్ సైదాబాద్‌లోని ఓ ప్రైవేట్ పాఠశాలలో చోటుచేసుకున్న ఉదంతం తీవ్ర వివాదాస్పదంగా మారింది. రెండో తరగతి చదువుతున్న ఒక హిందూ విద్యార్థికి హోంవర్క్‌లో భాగంగా మతపరమైన ప్రార్థనలు కల్మా, సూరా అల్ ఫాతిహా రాయాలని, చదవాలని పాఠశాల యాజమాన్యం ఒత్తిడి తెచ్చిందనే వ్యవహారంపై కేంద్రమంత్రి కిషన్ రెడ్డి తీవ్రస్థాయిలో మండిపడ్డారు. ఈ ఘటనపై ఆయన సోషల్ మీడియా వేదికగా స్పందిస్తూ.. కాంగ్రెస్ ప్రభుత్వ నీచ రాజకీయాల వల్లే ఇలాంటి పరిస్థితులు తలెత్తుతున్నాయంటూ సీఎం రేవంత్ రెడ్డిపై ఘాటు విమర్శలు చేశారు. కిషన్ రెడ్డి తన పోస్ట్‌లో ఈ ఘటనను తీవ్రంగా ఖండించారు. ‘‘సైదాబాద్‌లోని ఒక ప్రైవేట్ స్కూల్‌లో క్లాస్ 2 హిందూ విద్యార్థిని హోంవర్క్ పేరుతో కల్మా, సూరా అల్ ఫాతిహాలను చదవాలని, రాయాలని బలవంతం చేయడం దిగ్భ్రాంతికి గురిచేసింది. ఇది పసిపిల్లల మనసుల్లో మతపరమైన ఆలోచనలను జొప్పించేందుకు జరుగుతున్న బహిరంగ ప్రయత్నం’’ అని ఆయన ఆరోపించారు.

**రాజకీయాల ఫలితమే: సీఎం రేవంత్ రెడ్డిపై విమర్శలు**

ఈ వివాదానికి రాష్ట్ర ప్రభుత్వ విధానాలే కారణమని కిషన్ రెడ్డి దుయ్యబట్టారు. ‘‘ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారూ.. కాంగ్రెస్ పార్టీ చేస్తోన్న విషపూరిత రాజకీయాల ఫలితం కాదా ఇది?’’ అని ఆయన ప్రశ్నించారు. అమాయక విద్యార్థులపై ఇటువంటి మతపరమైన రుద్దుళ్లను సహించేది లేదని స్పష్టం చేశారు.

**కఠిన చర్యలకు డిమాండ్**

పాఠశాల యాజమాన్యం నిర్వాకంపై విద్యార్థి తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తుండగా, ఈ వ్యవహారాన్ని ప్రభుత్వం, పోలీస్ యంత్రాంగం సీరియస్‌గా తీసుకోవాలని కిషన్ రెడ్డి కోరారు. చిన్నారుల భవిష్యత్తుతో ఆడుకుంటూ, మతపరమైన విద్వేషాలకు కారణమవుతున్న బాధ్యులపై తక్షణమే కఠిన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రస్తుతం ఈ వ్యవహారం నగరంలో తీవ్ర చర్చనీయాంశంగా మారింది.

## తుర్కపల్లిలో నకిలీ కరెన్సీ

ఉంచి మోసం చేసినట్లు గుర్తించాడని తెలిపాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు తుర్కపల్లి పోలీస్ స్టేషన్లో కేసు నమోదు చేసి, సాంకేతిక ఆధారాలు, సమాచారాన్ని, సేకరించి బుధవారం ముగ్గురు నిందితులను అదుపులోకి తీసుకున్నారు. అరెస్టు చేసిన వారిలో భువనగిరికి చెందిన ముదురుకోల యాకంబరం (29), ముదురుకోల దేవేందర్ (38) హయత్ నగర్ కుంట్లూరు కు చెందిన మద్దిబోయిన నాగరాజు (34) ను అరెస్టు చేశారు. వీరి వద్ద నుంచి పిల్లల ఆట కరెన్సీ నోట్ల 16 కట్టలు. రూ.10,000 నగదు. ఒక హీరో హోండా ప్యాషన్ మోటార్ సైకిల్, మూడు మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. విచారణలో ప్రధాన నిందితుడు ముదురుకోల యాకంబరం గతంలో సుబేదారి, నర్సంపేటు పోలీస్ స్టేషన్లలో నమోదైన నకిలీ కరెన్సీ కేసుల్లో నిందితుడిగా ఉండి, ఆ కేసుల్లో ఆరెసై జ్యుడీషియల్ రిమాండ్కు వెళ్లినట్లు, ఇటీవల జైలు నుంచి విడుదలై మళ్లీ ఇదే తరహా నేరాలకు పాల్పడుతున్నట్లు వెల్లడైంది. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ అక్షాన్స్ యాదవ్ ప్రజలకు సూచిస్తూ, సులభంగా అధిక డబ్బు వస్తుందనే ఆశతో ఎవరైనా వేసే అఫర్లను, కరెన్సీ మార్పిడి పేరుతో జరిగే మోసాలను నమ్మవద్దని తెలిపారు. ఎలాంటి అనుమానాస్పద వ్యక్తులు లేదా కార్యకలాపాలు గమనించిన వెంటనే సమీప పోలీస్ స్టేషన్ కు సమాచారం అందించాలని కోరారు. ప్రజలు అప్రమత్తంగా ఉంటే ఇటువంటి మోసాలను నివారించవచ్చని పేర్కొన్నారు. ఈ కేసును జిల్లా ఎస్పీ లక్షాన్స్ యాదవ్ పర్యవేక్షణలో, డీఎస్పీ పి. శ్రీనివాస్ నాయుడు. యాదగిరిగుట్ట రూరల్ సర్కిల్ ఇన్స్పెక్టర్ ఎం. శంకర్ మార్గదర్శకత్వంలో, తుర్కపల్లి ఎసీ మహమ్మద్ తఖియుద్దీన్, పోలీసు సిబ్బంది విజయవంతంగా ఛేదించారు.

## చైనాకు 14 దేశాల వార్నింగ్

జయభేరి, న్యూఢిల్లీ, జూలై 16 :



డ్రాగన్ కంట్రీ చైనా ప్రపంచంలో రెండో పవర్‌ఫుల్ దేశం. మొదటి స్థానం కోసం అనేక ప్రయత్నాలు చేస్తోంది. ఈ క్రమంలో అడ్డదారులు కూడా తొక్కుతుంది. ఈ క్రమంలో 2016, జూన్ 12 పర్మనెంట్ కోర్ట్ ఆఫ్ ఆర్బిట్రేషన్ (పీసీఏ) తీర్పు వచ్చి పదేళ్లు పూర్తయింది. ఈ సందర్భంగా అమెరికా, జపాన్, ఫిలిప్పీన్స్, ఆస్ట్రేలియా, బ్రిటన్, కెనడా, జర్మనీ, ఇటలీ, ఎస్టోనియా, లాట్వియా, లిథువేనియా, న్యూజిలాండ్, రొమేనియా, స్లోవేనియా మొత్తం 14 దేశాలు ఒకటిగా ముందుకు వచ్చాయి. ఈ సంయుక్త ప్రకటనలో 2016 తీర్పును ముఖ్యమైన మైలురాయిగా అభివర్ణించి, అది చైనా, ఫిలిప్పీన్స్ మధ్య అంతిమమైనది, చట్టబద్ధంగా బంధించేలా ఉంది, నిర్ణయాత్మకమైనది అని స్పష్టం చేశాయి. చైనా విస్తృత సముద్ర హక్కుల వాదనలకు అంతర్జాతీయ చట్టం(యూఎన్సీఎల్ఓఎస్) ప్రకారం ఎలాంటి చట్టబద్ధమైన ఆధారం లేదని వారు ధ్రువీకరించారు. శాంతియుత పరిష్కారం, బలవంతపు చర్యలను వ్యతిరేకించడం, నావిగేషన్, ఓవర్‌ఫ్లైట్ స్వేచ్ఛను కాపాడడం వంటి అంశాలను ఈ ప్రకటనలో నొక్కి చెప్పాయి.ఈ సంయుక్త ప్రకటనతో చైనా బాగా అసంతృప్తి చెందింది. బీజింగ్‌లోని జపాన్ ఎంబసీలోని చీఫ్ మినిస్టర్ (డిప్యూటీ చీఫ్ ఆఫ్ మిషన్)ను విదేశాంగ శాఖ అధికారి సమన్లు జారీ చేసి, తీవ్ర అసంతృప్తి, నిరసన వ్యక్తం చేసింది. జపాన్ ఇతర దేశాలతో కలిసి తప్పుడు తీర్పును ముందుకు తెచ్చి, ప్రాంతీయ శాంతిస్థిరత్వాన్ని దెబ్బతీస్తోందని, యుద్ధానంతర అంతర్జాతీయ వ్యవస్థను సవాలు చేస్తోందని చైనా ఆరోపించింది. జపాన్ ఈ వివాదంలో నేరుగా పాల్గొనే దేశం కాదు కాబట్టి దానికి చైనా సార్వభౌమాధికారం గురించి మాట్లాడే హక్కు లేదని చైనా పేర్కొంది. తన వాదనలను బలపరచుకోవడానికి చైనా సోషల్ మీడియాలో వీడియోను కూడా పంచుకుంది.ఈ తీర్పు 10వ వార్షికోత్సవం సందర్భంగా యూరోపియన్ యూనియన్ కూడా ప్రత్యేక ప్రకటన విడుదల చేసి, 2016 అవార్డును ముఖ్యమైనదిగా అభివర్ణించింది. యూఎన్సీఎల్ఓఎస్ ప్రకారం శాంతియుత పరిష్కారాలకు మద్దతు ఇచ్చింది.2016లో ఫిలిప్పీన్స్ చైనాపై దాఖలు చేసిన కేసులో పీసీఏ తీర్పు చైనా యొక్క “నైన్‌డాష్ లైన్”, చారిత్రక హక్కుల వాదనలను తిరస్కరించింది. ఈ తీర్పు ప్రకారం చైనా విస్తృత సముద్ర హక్కులకు అంతర్జాతీయ చట్టం కింద ఆధారం లేదు. చైనా ఈ తీర్పును ఎప్పటి నుంచో తిరస్కరిస్తోంది.దక్షిణ చైనా సముద్రం ప్రపంచ వాణిజ్యానికి అత్యంత ముఖ్యమైన రవాణా మార్గం. ఇక్కడి నుంచి పెద్ద ఎత్తున చమురు, సహజవాయువు రవాణా జరుగుతుంది. చైనా కృత్రిమ దీవుల నిర్మాణం, సైనిక కార్యకలాపాలు చేస్తోంది. ఫిలిప్పీన్స్ తన ఎక్స్‌క్లూజివ్ ఎకనామిక్ జోన్‌లో చైనా ప్రమాదకరమైన మాన్యూవర్లు చేస్తోందని ఆరోపిస్తోంది. అమెరికా, దాని మిత్రదేశాల నౌకాదళ పర్యటనలు, చైనా గస్తీల మధ్య ఈ ప్రాంతంలో ఉద్రిక్తతలు కొనసాగుతున్నాయి. భవిష్యత్తులో ఘర్షణలు తలెత్తే అవకాశం ఉందని విశ్లేషకులు హెచ్చరిస్తున్నారు. ఈ పరిణామాలు ప్రాంతీయ భద్రత, అంతర్జాతీయ సముద్ర చట్టాల అమలు, వాణిజ్య స్వేచ్ఛ వంటి అంశాలపై దృష్టి సారించాయి.

# శ్రీవారి నిత్యరాబడి రూ. 21.48 లక్షలు

**జయభేరి, యాదగిరిగుట్ట, జులై 16 :**



తెలంగాణ తిరుపతిగా పేరుగాంచిన శ్రీలక్ష్మి నరసింహా స్వామి వారికి నిత్యపూజలు కొనసాగుతున్నాయి. గురువారం తెల్లవారుజామున ఆలయాన్ని తెరిచిన అర్చకులు సుప్రభాతం, అర్చనను శాస్త్రోక్తంగా నిర్వహించిన అనంతరం భక్తులకు దర్శనాలకు అనుమతించారు.

శ్రీలక్ష్మీ నరసింహా స్వామి వారిని దర్శించుకున్న భక్తులు ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయంలో జరిగిన శ్రీసుదర్శన నారసింహ హోమం, నిత్య కల్యాణం, నిత్య బ్రహ్మోత్సవం, వెండి జోడి సేవ, స్వర్ణ పుష్పార్చన, శ్రీసత్యనారాయణ స్వామి వ్రత పూజలలో పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం కొండపైన కొలువైన శ్రీపర్వతవర్ధినీ సమేత రామలింగేశ్వరాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

పాతగుట్ట శ్రీలక్ష్మీ నరసింహా స్వామి వారిని దర్శించుకొని ఆలయంలో జరిగిన నిత్యపూజలలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

**శ్రీనారసింహుడి నిత్యరాబడి..**

శ్రీలక్ష్మీ నరసింహా స్వామి వారికి నిత్యరాబడిలో భాగంగా గురువారం రూ.13,02,018 ఆదాయం వచ్చినట్లు ఆలయ అధికారులు తెలిపారు. ప్రధాన బుకింగ్ ద్వారా రూ.68,050, బ్రేక్ దర్శనం ద్వారా రూ.1,14,300, శ్రీసత్యనారాయణ స్వామి వ్రత పూజల ద్వారా రూ.30,000, వీఐపీ దర్శనం ద్వారా రూ.1,26,450, కొండపైకి వాహన ప్రవేశం ద్వారా రూ.2,12,000, సువర్ణ పుష్పార్చన ద్వారా రూ.51,400, ప్రసాద విక్రయం ద్వారా రూ.5,57,440, కల్యాణకట్ట ద్వారా రూ.35,000తో పాటు వివిధ శాఖలు, పాతగుట్ట ఆలయం ద్వారా ఆదాయం వచ్చినట్లు అధికారులు తెలిపారు.



# రోడ్లను ఆక్రమించి ముందుకొస్తే చర్యలు తప్పవు

- **మున్సిపల్ చైర్‌పర్సన్ గుండ్లపల్లి వాణీ- భరత్‌గౌడ్**

**జయభేరి, యాదగిరిగుట్ట, జులై 16 :**

యాదగిరిగుట్ట పట్టణంలోని షాపులు రోడ్లను ఆక్రమించి ముందుకొస్తే చర్యలు తప్పవని యాదగిరిగుట్ట మున్సిపల్ చైర్‌పర్సన్ గుండ్లపల్లి వాణీభరత్‌గౌడ్ తెలిపారు. గురువారం యాదగిరిగుట్ట పట్టణంలోని వ్యాపారులతో ట్రాఫిక్ సీఐ కృష్ణతో కలిసి మున్సిపల్ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ యాదగిరిగుట్టకు రోజు రోజుకు భక్తుల రద్దీ పెరుగుతుందని, రద్దీకనుగుణంగా వ్యాపారులు నడుచుకోవాలన్నారు. షాపుల యజమానులు రోడ్డుకిరువైపులా ఆక్రమించొద్దని, త్వరలో హద్దులు ఏర్పాటు చేస్తామని తెలిపారు. వ్యాపారులు కచ్చితంగా ట్రాఫిక్ నియంత్రణలో ఉండాలని, పట్టణాభివృద్ధికి సహకరించాలన్నారు. ఈ సమావేశంలో మున్సిపల్ చైర్‌పర్సన్ బరిగె రమ్యరాంచందర్, కౌన్సిలర్ బబ్బురి శ్రీధర్, మున్సిపల్ కమిషనర్ బి.శ్రీనివాస్ యాదవ్, సిఐ బాస్కర్, వ్యాపారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. అనంతరం షాపుల వద్దకు వెళ్లి పలు సూచనలు చేశారు.



# పేదల పొట్ట కొట్టొద్దు

- **విజయ్ కుమార్, బీజేపీ కౌన్సిలర్**
- **రోడ్ల పక్కన చిరు వ్యాపారాల తొలగింపుపై మండిపాటు**

**జయభేరి, పరకాల, జులై 16:**

పరకాల పట్టణంలో రోడ్ల పక్కన ఉన్న చిరు వ్యాపారాలను తొలగిస్తున్న తీరుపై బీజేపీ 15వ వార్డు కౌన్సిలర్ కుక్కల విజయ్ కుమార్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీ నాయకుల ఒత్తిడికి అనుగుణంగా మున్సిపల్ కమిషనర్ వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. తెలంగాణ ఆవిర్భావం అనంతరం కొత్త జిల్లాల ఏర్పాటుతో పరకాలలో వ్యాపార కార్యకలాపాలు క్షీణించాయని, ఇప్పటికే అనేక మంది జీవనోపాధి కోల్పోయి ఇతర ప్రాంతాలకు వలస వెళ్లారని పేర్కొన్నారు. పట్టణంపై మమకారంతో మిగిలిన వారు కిరాణా దుకాణాలు, హోటళ్లు, పండ్ల వ్యాపారాలు వంటి చిన్నచిన్న ఉపాధి మార్గాలను ఆశ్రయించి కుటుంబాలను పోషించుకుంటున్నారని తెలిపారు. ఇలాంటి సమయంలో రోడ్ల పక్కన ఉన్నాయనే కారణంతో చిరు వ్యాపారాలను తొలగించడం వల్ల పేదల జీవనోపాధికి తీవ్ర నష్టం జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. పలుకుబడి ఉన్న వారికి మళ్లీ అనుమతులు లభిస్తున్నప్పటికీ, పేదలపైనే చర్యలు ఎక్కువగా జరుగుతున్నాయని ఆరోపించారు. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు మానవతా దృక్పథంతో వ్యవహరించి, చిరు వ్యాపారులకు అండగా నిలవాలని, వారి ఉపాధికి భంగం కలగకుండా చర్యలు తీసుకోవాలని విజయ్ కుమార్ కోరారు.



# అరుణోదయ నాగన్న ఆశయాలను కొనసాగిద్దాం

- **సంతాప సభ పోస్టర్ ఆవిష్కరణ**
- **సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ ఆధ్వర్యంలో**

**జయభేరి, దంతాలపల్లి :**



మండలం పెద్ద ముప్పారం గ్రామంలో అరుణోదయ నాగన్న సంతాప సభ పోస్టర్ ఆవిష్కరణ చేయడం జరిగింది. ఈ సందర్భంగా దంతాలపల్లి సబ్ డివిజన్ నాయకులు ఊడుగుల అనిల్ పాల్గొని ఆవిష్కరించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జూలై.25న హైదరాబాద్.సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరగనున్న నాగన్న సంతాప సభ కేవలం ఓ సంతాప సభ మాత్రమే కాదని, అది పోరాటాలకు పునఃప్రారంభం కావాలని పిలుపునిచ్చారు. నేటి సమాజంలో పేదలు, దళితులు, ఆదివాసీలు అన్యాయాలకు గురవుతున్న సమయంలో నాగన్నలాంటి నాయకుల అవసరం మరింత పెరిగిందని స్పష్టం చేశారు. నాగన్న ఒక గాయకుడు మాత్రమే కాదు...ఆయన గళం ఒక ఆయుధం, ఆయన పాటలు ఒక పోరాట పిలుపు. దాదాపు 50 సంవత్సరాల పాటు తన జీవితాన్ని పేద ప్రజల కోసం అంకితం చేస్తూ, అణగారిన వర్గాలలో చైతన్యం నింపిన విప్లవ కర్తగా నిలిచారని తెలిపారు. ఎన్నో నిర్బంధాలు, కష్టాలు, అణచివేతలను ఎదుర్కొంటూ చివరి శ్వాస వరకు ఉద్యమాన్ని విడిచిపెట్టకుండా నిలబడటం నాగన్న గొప్పతనమని కొనియాడారు. ప్రస్తుత పాలక వర్గాలు ప్రజల సమస్యలను విస్మరిస్తూ, సామాన్యుల జీవితాలను మరింత కష్టాల్లోకి నెట్టేస్తున్నాయని విమర్శించారు. అలాంటి సమయంలో నాగన్న చూపిన దారిలో పోరాటం తప్ప మరో మార్గం లేదని స్పష్టం చేశారు. కళారూపాలను ఆయుధంగా మార్చి ప్రజలలో చైతన్యం నింపిన నాగన్న స్ఫూర్తిని ప్రతి కార్యకర్త తమలో జీర్ణించుకోవాలని పిలుపునిచ్చారు. సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యుడిగా నాగన్న చేసిన సేవలు చిరస్మరణీయమని, ఆయన ఆశయాల సాధనకోసం ప్రతి ఒక్కరూ కట్టుబడి ఉండాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఐలమ్మ, లక్ష్మి, కేతమ్మ, సోమక్క, నాగమ్మ, సోమలక్ష్మి, కరుణ, కమలాకర్, జ్యోతి, కేతమ్మ, రజిని, రాణి తదితరులు పాల్గొన్నారు.

# మహిళల భద్రత ప్రతీ ఒక్కరి బాధ్యత

- **యాదగిరిగుట్ట డీఎస్పీ శ్రీనివాస్ నాయుడు**



**జయభేరి, యాదగిరిగుట్ట, జులై 16 :**

మహిళలు స్వేచ్ఛగా, ధైర్యంగా జీవించే హక్కు ఉందని, వారి భద్రత కోసం ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని యాదగిరిగుట్ట డీఎస్పీ శ్రీనివాస్‌నాయుడు సూచించారు. గురువారం యాదగిరిగుట్ట పట్టణంతో పాటు మండలంలోని పెద్దకందుకూరు, మాసాయిపేట గ్రామాల్లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మహిళల భద్రతపై అవగాహన నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ శ్రీనివాస్ నాయుడు మాట్లాడుతూ మహిళలు అత్యవసర పరిస్థితుల్లో ఉమెన్ హెల్ప్‌లైన్ 112, 181కు ఫోన్ చేయాలని, తెలియని వ్యక్తులతో వ్యక్తిగత సమాచారం పంచుకోవద్దని సూచించారు. రాత్రి సమయాల్లో ఒంటరిగా ప్రయాణించాల్సి వస్తే కుటుంబ సభ్యులు, స్నేహితులకు మీ లొకేషన్‌ను షేర్ చేయాలని, సోషల్ మీడియాలో అపరిచితులను నమ్మొద్దని, వేధింపులు, అనుమానాస్పద సంఘటనలు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. మహిళల ఆత్మవిశ్వాసాన్ని ఆత్మరక్షణ ద్వారా పెంచుకోవచ్చని, మహిళలు నిత్యం అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో సీఐ భాస్కర్, ఎస్సైలు సైదులు, రూప, సిబ్బంది మొయినుద్దీన్, ఇంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# జడ్పీ హైస్కూల్లో విద్యార్థులకు పోలీస్ శాఖ అభయ అవగాహన కార్యక్రమం

**జయభేరి, పరవాడ:**




మండల కేంద్రం అయ్యిన పరవాడ జడ్పీ హెచ్ స్కూల్లో గురువారం విద్యార్థులకు అభయ అవగాహన కార్యక్రమం నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో సుమారు 240 మంది బాలురు, బాలికలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పరవాడ పోలీస్ స్టేషన్ ఎస్ఐ జి.ఎస్.వి. మహాలక్ష్మి విద్యార్థులకు మహిళలు మరియు చిన్నారుల భద్రత వారి హక్కులు ఎదురయ్యే సమస్యలపై అవగాహన కల్పించారు.

పాఠశాలల్లో ఏర్పాటు చేస్తున్న డ్రాప్ బాక్స్ యొక్క ఉద్దేశ్యం, విద్యార్థులు తమకు ఎదురయ్యే సమస్యలు, వేధింపులు లేదా ఇతర ఫిర్యాదులను గోప్యంగా తెలియజేయడానికి ఉపయోగించే విధానం గురించి వివరించారు. అదేవిధంగా అత్యవసర పరిస్థితుల్లో సంప్రదించవలసిన 100, 112, 181, 1930 టోల్ ఫ్రీ నంబర్ల ప్రాముఖ్యతను వివరించి వాటి ద్వారా పొందగల సహాయ సేవల గురించి విద్యార్థులకు తెలియజేశారు. అలాగే పోక్సో చట్టం గురించి అవగాహన కల్పిస్తూ, చిన్నారులపై లైంగిక వేధింపులు, దుర్వినియోగం వంటి ఘటనలను వెంటనే తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు లేదా పోలీసులకు తెలియజేయాలని సూచించారు. విద్యార్థులు నిర్భయంగా తమ సమస్యలను వెల్లడించి చట్టాల ద్వారా కల్పించబడిన రక్షణను సద్వినియోగం చేసుకోవాలని పరవాడ ఎస్ ఐ జి.ఎస్.వి. మహాలక్ష్మి అన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలి

- **బొచ్చు కళ్యాణ్, ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు**



**జయభేరి, పరకాల, జులై 16:**

గురువారం ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో బీసీ వెల్ఫేర్ అర్ సి ఓ రాజ్ కుమార్ కి ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో వినతి పత్రం ఇవ్వడం జరిగింది. అనంతరం ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు కళ్యాణ్ మాట్లాడుతూ హన్మకొండ జిల్లాలో ఉన్న బీసీ గురుకులాలకు సొంత భవనాలు నిర్మించాలని అదేవిధంగా హాస్టల్ లో ఉంటున్న విద్యార్థులకు మౌలిక సదుపాయాలు కల్పించాలని, విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని ఆర్సిఓ కి వినతి పత్రం ఇవ్వడం జరిగింది ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యుడు సన్నీ పాల్గొన్నారు.

# బోనాలకు ప్రభుత్వం రూ.20 కోట్ల నిధుల కేటాయింపు



**జయభేరి, దేవరకద్ర :**

బోనాల పండుగ నిర్వహణకు ప్రభుత్వం రూ.20 కోట్ల నిధులను కేటాయించిందని మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గ ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి (జిఎంఆర్) అన్నారు. వచ్చే నెల 13 వరకు బోనాల ఉత్సవాలను ఘనంగా నిర్వహించడం ఆనవాయితీగా వస్తుందన్నారు. అందులో భాగంగానే ప్రతి ఒక్కరూ ఆనందోత్సాహాల మధ్య అమ్మవారి ఈ బోనాల పండుగ ఉత్సవాలను నిర్వహించుకోవాలని ఆయన కోరారు. దీనికిగాను భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రభుత్వం సమగ్ర ఏర్పాట్లు చేసిందన్నారు. గోల్కొండ, ఉజ్జయిని, మహంకాళి, బల్కంపేట ఆలయాలలో బోనాల ఉత్సవాలకు ప్రభుత్వం ప్రత్యేక ఏర్పాట్లు చేసిందని ఎమ్మెల్యే జిఎంఆర్ అన్నారు. తెలంగాణ సంస్కృతి, సాంప్రదాయాలకు ఈ పండుగ ప్రతీక అని ఆయన అన్నారు. ఈ ఉత్సవాలను ప్రతి ఒక్కరు భక్తిశ్రద్ధలతో, సాంప్రదాయ రీతిలో నిర్వహించుకోవాలన్నారు. ఈ సందర్భంగా ప్రజలకు ఎమ్మెల్యే జిఎంఆర్ బోనాల పండుగ శుభాకాంక్షలు తెలిపారు కోరారు.

# పెందుర్తి మాజీ ఎమ్మెల్యే అదీప్ రాజ్‌ను ఘనంగా సత్కరించిన చుక్కా


**జయభేరి, పరవాడ:**



రాంపురం నియోజకవర్గ వైఎస్సార్సీపీ కేంద్ర కార్యాలయంలో గురువారం వైఎస్సార్సీపీ రాష్ట్ర కార్యదర్శి, మాడుగుల నియోజకవర్గ పరిశీలకులు పైల శ్రీనివాసరావు సమక్షంలో పెందుర్తి మాజీ శాసనసభ్యులు, వైఎస్సార్సీపీ రాష్ట్ర యువజన విభాగం వర్కింగ్ ప్రెసిడెంట్ అన్నంరెడ్డి అదీప్ రాజ్ను వైఎస్సార్సీపీ అనకాపల్లి జిల్లా అధికార ప్రతినిధి చుక్కా రాము నాయుడు శాలువాతో ఘనంగా సత్కరించారు.

ఈ సందర్భంగా చుక్కా రాము నాయుడు మాట్లాడుతూ ఇటీవల తనకు వైఎస్సార్సీపీ అనకాపల్లి జిల్లా అధికార ప్రతినిధిగా బాధ్యతలు అప్పగించిన పార్టీ నాయకత్వానికి కృతజ్ఞతలు తెలియజేస్తూ అందులో భాగంగానే ఈ మర్యాదపూర్వక సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించినట్లు తెలిపారు. పార్టీ బలోపేతానికి అంకితభావంతో పనిచేస్తానని, నాయకత్వం తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటానని అన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ నాయకులు దేవి సాంబ, గండి రవికుమార్, పరవాడ మండల వైఎస్సార్సీపీ వైస్ ఎంపీపీ బంధం నాగేశ్వరరావు, పెందుర్తి నియోజకవర్గ యువజన విభాగం అధ్యక్షుడు పెదిశెట్టి శేఖర్, మండల పార్టీ అధ్యక్షుడు కోన రామారావు, మాజీ మార్కెట్ కమిటీ డైరెక్టర్ పైల అప్పలనాయుడు, మాజీ మండల పార్టీ అధ్యక్షుడు బొద్దపు చిన్నారావు, నాయకులు గండి రామకృష్ణ, పరవాడ జగదీష్, గండి చంద్రరావు, కసిరెడ్డి అప్పలరాజు, వర్రీ హరితో పాటు పరవాడ మండలానికి చెందిన పలువురు వైఎస్సార్సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ప్రథమ వర్ధంతి కార్యక్రమంలో పాల్గొన్న సోదా రామకృష్ణ



**జయభేరి, పరకాల, జులై 16:**

గురువారం కాంగ్రెస్ పార్టీ పరకాల మండల మాజీ అధ్యక్షులు కట్కూరి దేవేందర్ రెడ్డి తల్లి గారైన కీ,,శే,, కట్కూరి సమ్మక్క ప్రథమ వర్ధంతి (సంవత్సరిక), విగ్రహావిష్కరణ కార్యక్రమం వారి స్వగ్రామమైన పరకాల మండలంలోని నాగారం గ్రామంలో జరగగా కార్యక్రమంలో పాల్గొన్న పరకాల పట్టణ కాంగ్రెస్ పార్టీ సమన్వయ కమిటీ సభ్యులు మున్సిపల్ సోదా రామకృష్ణ. ఈ కార్యక్రమంలో రామకృష్ణతో పాటు గా మాజీ ఎంపీపీ ఏనుక తాళ్ల రవీందర్, పరకాల కాంగ్రెస్ పార్టీ సమన్వయ కమిటీ సభ్యులు బండి సదానందం గౌడ్, మార్క రఘుపతి గౌడ్, నల్లెల్ల అనిల్ కుమార్, ఏకు రాజు బొచ్చు జెమిని తదితరులు పాల్గొన్నారు.



## రాష్ట్ర దీప ధూప నైవేద్య బంజారా బావోజీల అర్చక సంఘం ఎన్నిక

జయభేరి, దేవరకొండ :

తెలంగాణ రాష్ట్ర దీప ధూప నైవేద్య బంజారా బావోజీల అర్చక సంఘం రాష్ట్ర అధ్యక్షులు మద్దిమడుగు పీఠాధిపతి శ్రీ జయరాం గురుస్వామి ఆదేశానుసారం జిల్లాల వారీగా కమిటీలు ఏర్పాటు చేయడం జరిగింది. ఉమ్మడి నల్గొండ జిల్లా బంజారా దీప ధూప నైవేద్య అర్చక సంఘం నూతన జిల్లా కమిటీ ఎన్నిక అధ్యక్షులు నేనావత్ కిషన్ బావోజీ ఉపాధ్యక్షులు భూక్యా సేవా కోశాధికారి మేగావత్ అయోధ్య రాముడు ప్రధాన కార్యదర్శి సపవత్ రమేష్ సహాయ కార్యదర్శి రవి స్వామి కార్యదర్శి భూక్యా బాలు కార్యవర్గ సభ్యులు తుకారాం గౌరవ అధ్యక్షులు అంగోతు మత్రు బావోజీ బాబూలాల్ బావోజీ ధనవత్ సక్కు బావోజీ మునావత్ లచ్చిరాం బావోజీ గుగులోత్ జైల్ సింగ్ అట్టి కమిటీలో మూడు జిల్లాల బంజారా అర్చక బావోజీలు, సాదు సంత్ లు అందరూ కలిసి ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. అధ్యక్షులు కిషన్ బావోజీ ఉపాధ్యక్షులు సేవ వారికి సహకరించిన బావజీలు అందరికీ ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతూ బావజీల సమస్యలపై రాష్ట్ర దృష్టికి తీసుకెళ్లి వారికి కృషి చేస్తానని పేర్కొన్నారు.

## జల్ శక్తి అభియాన్ – జల్ సంవిధాన్" అవగాహన కార్యక్రమం



జయభేరి, దేవరకొండ :

దేవరకొండ మున్సిపాలిటీ పరిధిలో జల్ శక్తి అభియాన్ CatchTheRain కార్యక్రమంలో భాగంగా జల్ సంవిధాన్ ప్రధాన భావనతో 7వ వార్డులో ప్రజలకు జల సంరక్షణపై అవగాహన కార్యక్రమం నిర్వహించబడింది. ఈ సందర్భంగా జల్ సంవిధాన్ ద్వారా ప్రతి పౌరుడు నీటిని సంరక్షించడం తన సామాజిక బాధ్యతగా భావించి, వర్షపు నీటి సంరక్షణ (Rainwater Harvesting), భూగర్భ జలాల పరిరక్షణ, నీటి వృథా నివారణ మరియు ప్రతి ఇంటిలో వర్షపు నీటి నిల్వ వ్యవస్థలను ఏర్పాటు చేయడం వంటి అంశాలపై విస్తృత అవగాహన కల్పించారు. నీటి సంరక్షణలో ప్రజల భాగస్వామ్యమే సుస్థిర భవిష్యత్తుకు పునాది అని అధికారులు వివరించారు. ఈ అవగాహన కార్యక్రమంలో 7వ వార్డు కౌన్సిలర్ శ్రీ సాయి చంద్ర TPBO వర్షిత ఎన్విరాన్మెంటల్ ఇంజనీర్ రమావత్ సక్కు నాయక్ , మున్సిపల్ సిబ్బంది మరియు వార్డు ప్రజలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అధికారులు జల్ సంవిధాన్ - ప్రతి ఇంటి బాధ్యత, ప్రతి పౌరుడి కర్తవ్యం అనే సందేశాన్ని ప్రజల్లో విస్తృతంగా తీసుకెళ్లాలని, ప్రతి ఒక్కరూ CatchTheRain కార్యక్రమం నిర్వహించాలని సూచించారు.

## రెవెన్యూ రికవరీ యాక్ట్ ను ఎత్తివేయాలి

- **సామాజికవేత్త, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ చింతపల్లి శ్రీనివాస్ గౌడ్ డిమాండ్**



జయభేరి, దేవరకొండ :

దేవరకొండ పట్టణంలో జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో తెలంగాణ అమరవీరుల స్థూపం ముందు విద్యార్థులతో కలిసి నల్ల బ్యాడ్జీలు ధరించి మౌన దీక్ష తో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సామాజికవేత్త, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ చింతపల్లి శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ విద్యార్థులపై రెవెన్యూ రికవరీ యాక్టును ఎత్తివేయాలని, జీవో నెంబర్ 9 ను వెంటనే రద్దు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఫీజులు కట్టలేక సీట్లను విద్యార్థులు వదులుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పెద్ద ఎత్తున నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. విద్యాశాఖ పై అఖిలపక్ష సమావేశం నిర్వహించి విద్యార్థులకు న్యాయం చేయాలని, విద్యార్థులపై చిన్న చూపు చూడకుండా ఫీజ్ రియంబర్స్మెంట్ విడుదలను తీవ్ర నిర్లక్ష్యం వహించరాదన్నారు. 14 లక్షల మంది విద్యార్థుల భవిత అంధకారంగా మారే ప్రమాదం ఉందని, ప్రభుత్వం ఫీజు రియంబర్స్మెంట్ పథకంపై పూటకో మాట మాట్లాడుతుందని బకాయిలు చెల్లించని యెడల ఎమ్మెల్యేల ఇల్లు ముట్టడిస్తామని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో రెడ్డి కోటేశ్వరరావు, భీమగోని శివ గౌడ్, సొల్లేటి భాస్కరాచారి, పున్న బిక్షమయ్య, మునగాల గణేష్, కాటం వెంకటేష్ గౌడ్ మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

## ఆషాఢ మాసం బోనాల పండుగ నిధుల కోసం దరఖాస్తుల ఆహ్వానం

- **ఉప్పల్ నియోజకవర్గంలోని అన్ని ఆలయ కమిటీలకు ముఖ్య విజ్ఞప్తి**

జయభేరి, ఉప్పల్ :

ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ఆదేశాల మేరకు, ఆషాఢ మాసం బోనాల పండుగను భక్తిశ్రద్ధలతో, వైభవంగా నిర్వహించేందుకు తెలంగాణ ప్రభుత్వం ఆలయాలకు ప్రత్యేక నిధులను అందజేస్తోంది. ఈ నేపథ్యంలో అర్హత కలిగిన అన్ని ఆలయ కమిటీలు వెంటనే తమ దరఖాస్తులను సిద్ధం చేసి సమర్పించవలసిందిగా కోరడమైనది.

**దరఖాస్తుకు అవసరమైన పత్రాలు**

గుడి రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్, ఆలయ లెటర్ హెడ్, ఆలయ ఫోటో, ఆలయ కమిటీ అధ్యక్షుడి ఆధార్ కార్డు, ట్రెజరర్ ఆధార్ కార్డు, బ్యాంక్ పాస్‌బుక్ జిరాక్స్, గత సంవత్సరం ప్రభుత్వం మంజూరు చేసిన నిధులకు సంబంధించిన చెక్ కాపీ (ఉంటే).


**దరఖాస్తులు సమర్పించవలసిన స్థలం**

ఉప్పల్ శ్రీ ఆంజనేయ స్వామి దేవాలయం - ఈవో (EO) కార్యాలయం. అర్హత కలిగిన అన్ని ఆలయ కమిటీలు అవసరమైన పత్రాలతో వీలైనంత త్వరగా దరఖాస్తులు సమర్పించి ప్రభుత్వం అందిస్తున్న ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరడమైనది.

# రెండేళ్ల చిన్నారికి అరుదైన హైపోస్పాడియాస్ శస్త్రచికిత్స విజయవంతం

- **డా. నితేష్ బత్తల నేతృత్వంలో క్లిష్టమైన TIP యూరేథ్రోప్లాస్టీ విజయవంతం**

జయభేరి, మేడ్చల్:




పుట్టుకతో మూత్రనాళాల అమరికలో ఏర్పడిన హైపోస్పాడియాస్ (Hypospadias) సమస్యతో బాధపడుతున్న రెండేళ్ల చిన్నారికి మేడ్చల్‌లోని మెడినోవా సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో అత్యంత క్లిష్టమైన హైపోస్పాడియాస్ రిపేర్ (TIP యూరేథ్రోప్లాస్టీ) శస్త్రచికిత్సను విజయవంతంగా నిర్వహించినట్లు ఆస్పత్రి వైద్యులు తెలిపారు. ఈ శస్త్రచికిత్సను కన్సల్టెంట్ యూరాలజిస్ట్ డా॥ నితేష్ బత్తల నేతృత్వంలో అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో పూర్తి చేశారు. వైద్యుల వివరాల ప్రకారం, చిన్నారిలో పుట్టుకతోనే మూత్రనాళం సహజ స్థానంలో అభివృద్ధి చెందకపోవడంతో మూత్ర విసర్జనలో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. దీంతో చిన్నారి తల్లిదండ్రులు మెడినోవా సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిని ఆశ్రయించారు.

పూర్తి వైద్య పరీక్షలు నిర్వహించిన అనంతరం చిన్నారికి హైపోస్పాడియాస్ సమస్య ఉన్నట్లు నిర్ధారించారు. హైపోస్పాడియాస్‌లో మూత్రనాళం ద్వారం పురుషాంగం కొన వద్ద కాకుండా కింది భాగంలో ఏర్పడుతుందని వైద్యులు తెలిపారు. ఈ సమస్య వల్ల మూత్ర విసర్జనలో ఇబ్బందులు తలెత్తడమే కాకుండా, భవిష్యత్తులో లైంగిక ఆరోగ్యం, సంతానోత్పత్తిపై కూడా ప్రభావం చూపే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు.

అందువల్ల చిన్న వయస్సులోనే శస్త్రచికిత్స ద్వారా ఈ లోపాన్ని సరిచేయడం అవసరమని వైద్యులు సూచించారు. దీంతో డా॥ నితేష్ బత్తల నేతృత్వంలో అత్యాధునిక పద్ధతిలో TIP యూరేథ్రోప్లాస్టీ శస్త్రచికిత్స నిర్వహించారు. శస్త్రచికిత్స అనంతరం చిన్నారిని కొద్ది రోజుల పాటు వైద్యుల పర్యవేక్షణలో ఉంచి అవసరమైన చికిత్స అందించారు. ఆరోగ్యం మెరుగుపడటంతో చిన్నారిని డిశ్చార్జ్ చేసినట్లు తెలిపారు. భవిష్యత్తులో సాధారణ మూత్ర విసర్జనతో పాటు ఆరోగ్యకరమైన జీవితం గడపగలడని వైద్యులు వెల్లడించారు.

ఈ సందర్భంగా కన్సల్టెంట్ యూరాలజిస్ట్ డా॥ నితేష్ బత్తల మాట్లాడుతూ హైపోస్పాడియాస్ అనేది పుట్టుకతో వచ్చే లోపమే అయినప్పటికీ సరైన సమయంలో శస్త్రచికిత్స చేయిస్తే పిల్లలు పూర్తిగా సాధారణ జీవితాన్ని గడపవచ్చని చెప్పారు. పిల్లల్లో మూత్ర విసర్జనలో అసాధారణ లక్షణాలు కనిపిస్తే నిర్లక్ష్యం చేయకుండా వెంటనే యూరాలజీ నిపుణులను సంప్రదించాలని సూచించారు. మెడినోవా సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో అత్యాధునిక వైద్య సదుపాయాలు, అనుభవజ్ఞులైన నిపుణులు, ఆధునిక ఆపరేషన్ థియేటర్ల సాయంతో క్లిష్టమైన యూరాలజీ శస్త్రచికిత్సలు విజయవంతంగా నిర్వహిస్తూ మేడ్చల్‌తో పాటు పరిసర ప్రాంతాల ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందిస్తున్నట్లు ఆస్పత్రి యాజమాన్యం తెలిపింది.

# బిజెపి నాయకులపై కాంగ్రెస్ దాడులు

దేవరకొండ :



భారతీయ జనతా పార్టీ దేవరకొండ నియోజకవర్గం ఆధ్వర్యంలో చందంపేట మండల అధ్యక్షుడు వినోద్ చారిపై జరిగిన దాడిని తీవ్రంగా ఖండిస్తూ చందంపేటలో భారీ నిరసన ధర్నా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన బీజేపీ నల్లగొండ జిల్లా అధ్యక్షులు నాగం వర్షిత్ రెడ్డి ,రాష్ట్ర నాయకులు కేతావత్ లాలు నాయక్ మాట్లాడుతూ, కాంగ్రెస్ పార్టీ నాయకులు, గుండాల దాడులతో బీజేపీ కార్యకర్తలను భయభ్రాంతులకు గురిచేయాలని ప్రయత్నించడం అత్యంత దుర్మార్గమని మండిపడ్డారు. ప్రజాస్వామ్యంలో హింసకు, దౌర్జన్యాలకు ఎలాంటి స్థానం లేదని అన్నారు. చందంపేట మండల అధ్యక్షుడు వినోద్ చారిపై జరిగిన దాడి అత్యంత ఖండనీయమని, దాడికి పాల్పడిన వారిపై పోలీసులు వెంటనే కఠిన చర్యలు తీసుకుని బాధ్యులను అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. చట్టాన్ని చేతుల్లోకి తీసుకునే వారిని ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోమని హెచ్చరించారు. బీజేపీ కార్యకర్తలు ప్రజా సమస్యలపై పోరాడుతూనే ఉంటారని, బెదిరింపులకు, దాడులకు భయపడే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించేందుకు భారతీయ జనతా పార్టీ ఎల్లప్పుడూ ముందుంటుందని పేర్కొన్నారు. ఈ నిరసన కార్యక్రమంలో బిజెపి మాజీ పార్లమెంట్ కన్వీనర్ నక్క వెంకటేష్ యాదవ్, బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి విద్యాసాగర్ రెడ్డి, ఉపాధ్యక్షులు వానం నరేందర్ రెడ్డి, ఎస్టి మోర్చా జిల్లా అధ్యక్షులు వినోద్ రాథోడ్ , ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షులు బాకీ నరసింహ, ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షులు పిట్టల శ్రీనివాస్, కిసాన్ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు చివర్ల రమేష్, ధార్మిక సెల్ కో కన్వీనర్ వనం సుజాత సీనియర్ నాయకులు బెజవాడ శేఖర్ చెనమోని రాములు, వనం పుష్పలత, ఏటి కృష్ణ,మండల అధ్యక్షులు, భరత్ గౌడ్ , నేనావత్ రాము నాయక్ వినోద్ చారి, నాగిళ్ల అంజి ఆంజనేయులు, సముద్రాల నగేష్, రామలింగం, గోలి శ్యామ్ ,వివిధ మోర్చాల నాయకులు, ప్రజాప్రతినిధులు, పార్టీ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని వినోద్ చారి కి సంఘీభావం ప్రకటించారు.

# లేబర్ ఖర్చుల పెరుగుదలతో సెంట్రింగ్ ఛార్జీల పెంపు

- **మేడ్చల్ సెంట్రింగ్ ఓనర్స్ అసోసియేషన్..**

జయభేరి, మేడ్చల్ :



లేబర్ వ్యయాలు, సెంట్రింగ్ సామగ్రి ధరలు, ఇతర నిర్వహణ ఖర్చులు గణనీయంగా పెరగడంతో సెంట్రింగ్ ఛార్జీలను పెంచినట్లు మేడ్చల్ సెంట్రింగ్ ఓనర్స్ అసోసియేషన్ సభ్యులు తెలిపారు. గత కొన్ని రోజులుగా ఛార్జీల పెంపు కోసం సమ్మె నిర్వహించిన విషయం తెలిసిందే. గతంలో సెంట్రింగ్‌కు రూ.30 నుంచి రూ.35 వరకు వసూలు చేయగా, ప్రస్తుతం రూ.5 పెంచి రూ.40గా నిర్ణయించినట్లు వారు వెల్లడించారు. స్థానిక కార్మికులు సెంట్రింగ్ పనులకు ముందుకు రాకపోవడంతో ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన కార్మికులతో పనులు చేయించాల్సి వస్తోందని, దీంతో లేబర్ ఖర్చులు మరింత పెరుగుతున్నాయని పేర్కొన్నారు. అదేవిధంగా సెంట్రింగ్ డబ్బాల ధరలు పెరగడంతో పాటు నిర్మాణ స్థలాల్లో సామగ్రి చోరీలకు గురవుతుండడం వల్ల కూడా తీవ్ర నష్టాలు ఎదురవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం పనులు చేసినా ఆశించిన ఆదాయం లేక నష్టాలపాలవుతున్న పరిస్థితి నెలకొందని తెలిపారు. అన్ని రకాల ఖర్చులు పెరగడం వల్లే సెంట్రింగ్ ఛార్జీలను రూ.5 మేర పెంచాల్సి వచ్చిందని, ఇళ్లు నిర్మించుకునే వారు తమ పరిస్థితిని అర్థం చేసుకోవాలని సంఘం సభ్యులు విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో సంఘం అధ్యక్షుడు శ్రీనివాస్ రెడ్డి, చైర్మన్ మధుసూదన్ రెడ్డి, గోపాల్, ప్రతాప్ రెడ్డి, సత్తయ్య, మోసిన్, కనకరాజు, సయ్యద్ షేరు, ఇమ్రాన్, సుధాకర్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# మేడ్చల్‌లో రామ్‌రాజ్ కాటన్ షోరూమ్ ప్రారంభం

జయభేరి, మేడ్చల్ :



మేడ్చల్ పట్టణంలో నూతనంగా ఏర్పాటు చేసిన రామ్‌రాజ్ కాటన్ షోరూమ్‌ను మేడ్చల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తోటకూర వజ్రేష్ (జంగయ్య) యాదవ్, మేడ్చల్ మాజీ ఎమ్మెల్యే మలిపెద్ది సుధీర్ రెడ్డి గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే మలిపెద్ది సుధీర్ రెడ్డి మాట్లాడుతూ మేడ్చల్ పట్టణంలో రామ్‌రాజ్ కాటన్ వంటి ప్రముఖ వస్త్ర సంస్థ నూతన షోరూమ్‌ను ఏర్పాటు చేయడం సంతోషకరమన్నారు. షోరూమ్ నిర్వాహకులకు శుభాకాంక్షలు తెలియజేస్తూ, వినియోగదారులకు నాణ్యమైన వస్త్రాలను సరసమైన ధరలకు అందిస్తూ వ్యాపార రంగంలో మరింత అభివృద్ధి సాధించాలని ఆకాంక్షించారు.

వినియోగదారుల విశ్వాసాన్ని నిలబెట్టుకుంటూ ఉత్తమ సేవలను అందిస్తే సంస్థ మరింత ఉన్నత స్థాయికి చేరుకుంటుందని అన్నారు. ఇలాంటి వ్యాపార సంస్థలు మేడ్చల్ ఆర్థికాభివృద్ధికి తోడ్పడటంతో పాటు స్థానికంగా ఉపాధి అవకాశాలు పెరగడానికి దోహదం చేస్తాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నర్సాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి ఆవుల రాజిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే మలిపెద్ది సుధీర్ రెడ్డి, తెలంగాణ కాంగ్రెస్ సీనియర్ నాయకుడు నక్క ప్రభాకర్ గౌడ్, 297 డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు నడికొప్పు నాగరాజు (చాపరాజు) ముదిరాజ్, 298 డివిజన్ అధ్యక్షుడు రొయ్యపల్లి మల్లేష్ గౌడ్, 299 డివిజన్ అధ్యక్షుడు గర్మాల సురేందర్ ముదిరాజ్, మూడు చింతలపల్లి మున్సిపాలిటీ కాంగ్రెస్ అధ్యక్షుడు వెంకటేష్, నడికొప్పు రంజిత్ ముదిరాజ్, రామన్నగారి రాఘవేందర్ గౌడ్, కనకాల శివకుమార్ (బిపిటి రాజు), గోమారం బాల్‌రెడ్డి, ఉదండపురం సత్యనారాయణ, గోమారం రమణారెడ్డి, బత్తుల మధుకర్ యాదవ్, దుర్గం వెంకటేష్ ముదిరాజ్, మేకల రాజశేఖర్ రెడ్డి (బబ్లూ), నడికొప్పు బాలమల్లేష్ ముదిరాజ్, పెగుడ శ్యాంరావు, దుబ్బ రామస్వామి ముదిరాజ్, రామన్నగారి సంతోష్ గౌడ్, ఆటో విజయ్, ప్రభు ముదిరాజ్, దండు శ్రీకాంత్, లవంగు రాకేష్ వంజరి, సుదర్శన్ రెడ్డి, రవీందర్ గౌడ్‌తో పాటు ఇందిరమ్మ కమిటీ సభ్యులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, మహిళలు, యువకులు పాల్గొన్నారు.



## మోక్షాన్ని కలిగించే మహిమాన్వితయాత్ర జగన్నాథ రథయాత్ర

- **హైకోర్టు న్యాయవాది సరోజ్ రెడ్డి**

జయభేరి, దేవరకద్ర :

దర్శన భాగ్యంతోనే మోక్షాన్ని కలిగించే మహి మాన్విత యాత్ర జగన్నాథ రథయాత్ర అని మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గ హైకోర్టు న్యాయవాది, బిఆర్ ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు మందడి సరోజ్ రెడ్డి అన్నారు.గురువారం ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా సరోజ్ రెడ్డి నియోజకవర్గ ప్రజలకు పూరి జగన్నాథ రథయాత్ర శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆ జగన్నాథుడు బలభద్ర సుభద్ర సమేథు డై రథంపై పురవీధుల్లో పయనిస్తూ ముక్తిని కలిగించే గొప్పనైన ఆధ్యాత్మిక యాత్ర ఈ రథయాత్ర అని ఆయన కొనియాడారు ఈతి బాధలు తప్పించి, దర్శన భాగ్యంతోనే మోక్షాన్ని కలిగించే మహిమాన్విత యాత్ర జగన్నాథ రథయాత్ర అని సరోజ్ రెడ్డి అన్నారు ఈ సందర్భంగా ప్రజలందరికీ సరోజ్ రెడ్డి జగన్నాథ రథయాత్ర శుభాకాంక్షలు తెలిపారు.

## యువత క్రీడల్లో చురుకుగా పాల్గొనలి

- **ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి**



జయభేరి, ఉప్పల్ :

ఫ్రెండ్స్ బ్యాడ్మింటన్ లీగ్-8వ ఎడిషన్ గ్రాండ్ ఫినాలేలో విజేతలకు బహుమతుల ప్రదానం చేసిన ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి. ఉప్పల్‌లో నిర్వహించిన ఫ్రెండ్స్ బ్యాడ్మింటన్ లీగ్ (FBL) 8వ ఎడిషన్ గ్రాండ్ ఫినాలే పోటీలు ఉత్సాహభరితంగా ముగిశాయి. ఈ సందర్భంగా నిర్వహించిన బహుమతుల ప్రదానోత్సవంలో ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని విజేతలు, రన్నరప్ క్రీడాకారులకు ట్రోఫీలు, బహుమతులు అందజేసి అభినందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ, యువత క్రీడల్లో చురుకుగా పాల్గొనడం శారీరక, మానసిక ఆరోగ్యానికి ఎంతో దోహదపడుతుందని అన్నారు. ఇలాంటి క్రీడా పోటీలు యువతలో క్రమశిక్షణ, స్నేహభావం, పోటీతత్వాన్ని పెంపొందిస్తాయని పేర్కొన్నారు. భవిష్యత్తులో కూడా ఇలాంటి క్రీడా కార్యక్రమాలను మరింత విస్తృతంగా నిర్వహించాలని నిర్వాహకులను అభినందించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర సీనియర్ నాయకులు గంధం నాగేశ్వర్ రావు, నిర్వాహకులు సాజన్ ఖాన్, మహేందర్ రెడ్డి, క్రీడాకారులు, క్రీడాభిమానులు తదితరులు పాల్గొన్నారు.



# కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల విశ్వాసాన్ని పూర్తిగా కోల్పోయింది

- మోసం చేసిన ప్రభుత్వానికి ప్రజలే తగిన గుణపాఠం చెబుతారు
- డిక్లరేషన్‌లో పేరుతో అన్ని వర్గాలను కాంగ్రెస్ మోసం చేసింది
- జూలై 18న సరూర్‌నగర్‌లో యువ సంగ్రామ సదస్సు
- హైదరాబాద్ నగరానికి చెందిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు, సీనియర్ నాయకులతో ఎల్బీనగర్ ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి నివాసంలో కేటీఆర్ సమీక్షా సమావేశం
- హాజరైన ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి



**జయభేరి, ఉప్పల్ :**

కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా ప్రజల నమ్మకాన్ని కోల్పోయిందని, కేవలం సగం పదవీకాలం పూర్తికాక ముందే తీవ్ర ప్రజా వ్యతిరేకతను మూటగట్టుకున్న ప్రభుత్వంగా చరిత్రలో నిలిచిపోతుందని కేటీఆర్ అన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా అన్ని వర్గాలను మోసం చేసిన మోసకారి ప్రభుత్వంగా కాంగ్రెస్ మారిందని, అందుకే సమాజంలోని ప్రతి వర్గం ఆ ప్రభుత్వాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తోందని ఆయన విమర్శించారు. పార్టీ నేతలతో పాటు హైదరాబాద్ స్థానిక ఎమ్మెల్యేలు ఎమ్మెల్సీలు ప్రజాప్రతినిధులు, పార్టీ నేతలతో జరిగిన విస్తృత స్థాయి సమావేశంలో కేటీఆర్ మాట్లాడారు. ఆడబిడ్డల నుంచి అన్నదాతల వరకు, విద్యార్థుల నుంచి నిరుద్యోగ యువత వరకు ఏ ఒక్కరికి ఇచ్చిన హామీలను అమలు చేయలేదని కేటీఆర్ అన్నారు. ప్రజా సంక్షేమాన్ని పూర్తిగా విస్మరించి, అవినీతి, స్కామ్‌లు, అక్రమాలు, అరాచకాలనే పాలనగా మార్చుకున్నారని ఆరోపించారు. రేవంత్ రెడ్డి మాట్లాడుతున్న మాటలు, అనుసరిస్తున్న విధానాలు, సాగిస్తున్న పాలన ప్రజా కంటకంగా మారాయని విమర్శించారు. స్వయంగా ముఖ్యమంత్రి చేయించుకున్న సర్వేలోనే కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్రమైన ప్రజా వ్యతిరేకత వ్యక్తమైందని కేటీఆర్ పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ కాలం ముగిసిపోతుందనే విషయం స్పష్టమవుతున్న నేపథ్యంలోనే ముఖ్యమంత్రి అడ్డగోలుగా మాట్లాడుతూ తన అక్కసును వెళ్లగక్కుతున్నారని అన్నారు. రైతులు సాగునీటి కోసం అడుగుతుంటే, వారికి భరోసా ఇవ్వాల్సిన ముఖ్యమంత్రి "రక్తం పారిస్తా" అన్నట్లుగా మాట్లాడటం అత్యంత దురదృష్టకరమని కేటీఆర్ అన్నారు. ఒకవైపు రాష్ట్రంలో వ్యవసాయ రంగం తీవ్ర సంక్షోభంలో, కరువు అంచున ఉండగా, ముఖ్యమంత్రి చేస్తున్న వ్యాఖ్యలు రాష్ట్ర ప్రజలందరిలో తీవ్ర ఆగ్రహాన్ని రేకెత్తించాయని పేర్కొన్నారు. చివరకు రైతులు కూడా "మా రక్తాన్ని తీసుకోండి..కానీ మా పొలాలకు నీళ్లు ఇవ్వండి" అని డిమాండ్ చేసే పరిస్థితిని కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకొచ్చిందని విమర్శించారు. యువత, నిరుద్యోగుల విషయంలో కూడా కాంగ్రెస్ ప్రభుత్వం "యూత్ డిక్లరేషన్" పేరిట భారీ మోసం చేసిందని కేటీఆర్ ఆరోపించారు. విద్యార్థులు, నిరుద్యోగ యువత ఎప్పటికప్పుడు ఆ మోసాన్ని ఎండగడుతున్నారని అన్నారు. ఎన్నికల ముందు కాంగ్రెస్ ఇచ్చిన డిక్లరేషన్లలోని హామీల అమలు వైఫల్యాలను ప్రజలకు వివరించేందుకు బీఆర్ఎస్ వరుసగా సభలు నిర్వహిస్తోందని తెలిపారు. వరంగల్ రైతు సభ అనంతరం, ఈ నెల 18న సరూర్‌నగర్ స్టేడియంలో యువత, విద్యార్థులతో భారీ యువజన సదస్సు నిర్వహించి కాంగ్రెస్ యూత్ డిక్లరేషన్ వైఫల్యాలను ప్రజల ముందుంచనున్నట్లు కేటీఆర్ ప్రకటించారు. యువజన సభకు కాంగ్రెస్ పార్టీ అడ్డంకులు సృష్టించే అవకాశం ఉందని, అలాంటి ప్రయత్నాలను సమర్థంగా ఎదుర్కొనేందుకు నాయకులు, కార్యకర్తలు సిద్ధంగా ఉండాలని కేటీఆర్ సూచించారు. హైదరాబాద్‌తో పాటు పరిసర అసెంబ్లీ నియోజకవర్గాల నుంచి కూడా భారీ సంఖ్యలో యువత స్వచ్ఛందంగా సభకు తరలివస్తారని పార్టీ సీనియర్ నాయకులు కేటీఆర్‌కు వివరించారు. యువజన సభను విజయవంతం చేసేందుకు చేపట్టాల్సిన అన్ని ఏర్పాట్లపై సమావేశంలో సుదీర్ఘంగా చర్చించారు.

---



## జిల్లా పార్టీ అధికార ప్రతినిధిగా నియామకంపై బొడ్డేడకు కృతజ్ఞతలు తెలిపిన చుక్కా

**జయభేరి, పరవాడ:**

అనకాపల్లి జిల్లా వైఎస్సార్సీపీ అధికార ప్రతినిధిగా అవకాశం కల్పించిన పార్టీ నాయకత్వానికి చుక్కా రాము నాయుడు కృతజ్ఞతలు తెలిపారు. గురువారం మునగపాకలోని వైఎస్సార్సీపీ జిల్లా పార్టీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో వైఎస్సార్సీపీ రాష్ట్ర కార్యదర్శి, మాడుగుల నియోజకవర్గ పరిశీలకులు పైల శ్రీనివాసరావుతో కలిసి అనకాపల్లి జిల్లా పార్టీ అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్‌ను మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా చుక్కా రాము నాయుడు మాట్లాడుతూ తనపై పార్టీ ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ జిల్లా అధికార ప్రతినిధిగా పార్టీ విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు మండలంలో పార్టీ బలోపేతానికి అంకితభావంతో పనిచేస్తానని తెలిపారు. పార్టీ అధిష్ఠానం తనకు అప్పగించిన బాధ్యతను సమర్థవంతంగా నిర్వహిస్తానని చెప్పారు. ఈ కార్యక్రమంలో మండల వైఎస్సార్సీపీ వైస్ ఎంపీపీ బంధం నాగేశ్వరరావు, పెందుర్తి నియోజకవర్గ యువజన విభాగం అధ్యక్షుడు పెదిశెట్టి శేఖర్, మండల పార్టీ అధ్యక్షుడు కోన రామారావు, మాజీ మార్కెట్ కమిటీ డైరెక్టర్ పైల అప్పలనాయుడు, మాజీ మండల పార్టీ అధ్యక్షుడు బొద్ధపు చిన్నారావు, పార్టీ నాయకులు గండి రామకృష్ణ, పరవాడ జగదీష్,గండి చంద్రరావు, కసిరెడ్డి అప్పలరాజు, వర్రి హరి, ములకలపల్లి రమణతో పాటు పరవాడ మండలానికి చెందిన పలువురు వైఎస్సార్సీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

---

## పరవాడ సచివాలయం1లో నేడు ఆధార్ ప్రత్యేక క్యాంప్ నిర్వహణ




**జయభేరి, పరవాడ:**

స్థానిక పరవాడ మండల కేంద్రంలోని సచివాలయం1 లో శుక్రవారం ఆధార్ ప్రత్యేక క్యాంప్ నిర్వహిస్తున్నట్లు సచివాలయం సిబ్బంది ఒక ప్రకటనలో తెలిపారు.ఈ క్యాంప్ ఉదయం 10:00 గంటల నుండి సాయంత్రం 4:00 గంటల వరకు అందుబాటులో ఉంటుందని వారు పేర్కొన్నారు. కొత్త ఆధార్ కార్డుల నమోదు, బయోమెట్రిక్ అప్‌డేషన్, పేరు, చిరునామా, ఫోన్ నెంబర్ వంటి మార్పులు చేసుకోవాలనుకునే స్థానిక ప్రజలు మరియు కార్డుదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సిబ్బంది కోరారు.

---

## వైస్సార్సీపీ రాష్ట్ర కార్యదర్శి పైలను సన్మానించిన చుక్కా రాము నాయుడు



**జయభేరి, పరవాడ:**

వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి, మాడుగుల నియోజకవర్గ పరిశీలకులు పైల శ్రీనివాసరావును పరవాడ మండల పార్టీ కార్యాలయంలో గురువారం వైఎస్సార్‌సీపీ అనకాపల్లి జిల్లా అధికార ప్రతినిధి చుక్కా రాము నాయుడు శాలువాతో ఘనంగా సత్కరించారు. ఇటీవల అనకాపల్లి జిల్లా వైస్సార్సీపీ పార్టీ అధికార ప్రతినిధిగా తనకు బాధ్యతలు అప్పగించడంలో సహకారం అందించినందుకు కృతజ్ఞతగా ఈ సన్మాన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు చుక్కా రాము నాయుడు తెలిపారు. పార్టీ బలోపేతానికి, కార్యకర్తలతో సమన్వయం చేసుకుంటూ మరింత చురుకుగా పనిచేస్తానని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల వైఎస్సార్‌సీపీ వైస్ ఎంపీపీ బంధం నాగేశ్వరరావు, పెందుర్తి నియోజకవర్గ యువజన విభాగం అధ్యక్షుడు పెదిశెట్టి శేఖర్, మండల పార్టీ అధ్యక్షుడు కోన రామారావు, మాజీ మార్కెట్ కమిటీ డైరెక్టర్ పైల అప్పలనాయుడు, మాజీ మండల పార్టీ అధ్యక్షుడు బొద్ధపు చిన్నారావు, పార్టీ నాయకులు చుక్కా రవికుమార్, పరవాడ జగదీష్,గండి రామకృష్ణ, గండి చంద్రరావు,కసిరెడ్డి అప్పలరాజు, వర్రీ హరి, ములకలపల్లి రమణ పలువురు పరవాడ మండల వైఎస్సార్‌సీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

---

## బాసర సరస్వతి సన్నిధిలో అలరించిన అష్టావధానం

**జయభేరి, బాసర, జులై 16 :**

బాసర సరస్వతి సన్నిధి లో అలరించిన అష్టావధానం, ప్రత్యేక పూజా కార్యక్రమాలు శ్రీ వాగ్దేవి సంస్కృత భారతి ఆధ్వర్యంలో బాసర క్షేత్రంలోని జ్ఞాన సరస్వతి దేవాలయ సమీపంలో గల శివయోగి నిర్మల అంబయ్య సిద్ధాంతి సిద్ధాశ్రమ ము కోటి పార్థివశివలింగ శ్రీ మేధా దక్షిణామూర్తి సహిత ద్వాదశ జ్యోతిర్లింగమందిర మాసోత్సవం సందర్భంగా ప్రత్యేక పూజా కార్యక్రమాలు, ఆధ్యాత్మిక, ధార్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. ముందుగా దీపారాధన, కలశ స్థాపన, విఘ్నేశ్వరశ్వర పూజ, కోటి పార్థివ లింగ, శ్రీ మేధా దక్షిణామూర్తి సహిత ద్వాదశ జ్యోతిర్లింగములకు మహా రుద్రాభిషేకం పుష్పార్చన, బిల్వార్చన, గోపూజ,గణపతి, నవగ్రహ, రుద్రహోమములు, భూదాన సంకల్ప పూజ, మహా అన్నదానము నిర్వహించారు. .కవితా విద్వన్మణి ,అవధాన విభూషణ విద్వాన్ బైరపనేని పోతురాజు చౌదరి అష్టావధానం చేశారు . పద్యకోకిల ,అభినవ చ్ఛళ్ళపిళ్ళ డా..ఓంప్రకాశ్ బోచ్కర్ సంచాలకులు, పృచ్ఛకులు..ఆచార్య గొట్లూరి సురేశ్ బాబు,మైరోళ్ళ అశోక్ గౌడు, వల్లంభట్ల వనజ, డా.భోగయ చంద్రశేఖర్ శర్మ,గణపురం రాజేదర్, పేరంసంధ్యారాణి, దుర్గి శ్రవణ్ కుమార్ శర్మ, డాక్టర్ వెంకన్న జ్యోతి, పృ చ్ఛకులుగా పాల్గొన్నారు.

---



## అభివృద్ధి కార్యక్రమాలపై కలెక్టర్ ను కలిసిన ఎమ్మెల్యే జిఎంఆర్

**జయభేరి, దేవరకద్ర :**

మహబూబ్ నగర్ జిల్లా కలెక్టరేట్ లో గురువారం దేవరకద్ర నియోజకవర్గ ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి (జిఎంఆర్) జిల్లా కలెక్టర్ ను కలిసి నియోజకవర్గ అభివృద్ధి కార్యక్రమాలపై చర్చించారు. ఈ సందర్భంగా మిషన్ భగీరథ, బ్రహ్మోస్ ప్రాజెక్టుకు సంబంధించిన అంశాలపై కూడా ఆమెతో ఎమ్మెల్యే చర్చించారు. అలాగే ఎస్ఈ కార్యాలయంలో ఎస్ ఈ, డీఈ,ఏడిఈ తదితర విద్యుత్ అధికారులతో కూడా ఎమ్మెల్యే జిఎంఆర్ సమావేశమై నూతన సబ్ స్టేషన్లకు సంబంధించి ప్రతిపాదనలు తయారు చేయాలని కోరారు. అలాగే ట్రాన్స్ ఫార్మర్లు, విద్యుత్ ఉపకరణాలకు సంబంధించిన ప్రపోజల్ లను కూడా సిద్ధం చేయాలని కోరారు. విద్యుత్ కోతలు లేకుండా నిరంతరం విద్యుత్ అందించాలని వారిని ఎమ్మెల్యే జిఎంఆర్ కోరారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాలకు చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజా ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.




---

## నూతన కమిటీ అధ్యక్షుడు కుడిక్యాల రాములకు ఘన సన్మానం



**జయభేరి, గజ్వేల్, జూలై 16 :**

గజ్వేల్ నియోజకవర్గ నూతన కమిటీ అధ్యక్షుడు కుడిక్యాల రాములు, అలాగే కార్యవర్గ సభ్యుడు నాగులపల్లి పవన్ కుమార్ ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా గ్రామ నాయకులు వారికి శాలువాలు కప్పి, పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వర్గల్ గ్రామ సీనియర్ నాయకులు దిండి నాగరాజుగౌడ్, ఏశ్వంత్ రెడ్డి, నరేందర్ రెడ్డి, నూక బద్రీనాథ్, బబ్బురి వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు. నూతన బాధ్యతలు చేపట్టిన నాయకులు ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని ఆకాంక్షిస్తూ, వారి పదవీకాలం విజయవంతంగా సాగాలని నాయకులు శుభాకాంక్షలు తెలిపారు.

---

# నాగర్ కర్నూల్ లో కేఎల్ఐ కాల్వపై చర్చించిన ఎమ్మెల్యేలు, డిప్యూటీ మేయర్

- నష్టపోయిన రైతులకు నష్టపరిహారం ఇస్తామని హామీ

**జయభేరి, దేవరకద్ర :**



నాగర్ కర్నూల్ లో గురువారం కేఎల్ఐ కాల్వ పై దేవరకద్ర, నాగర్ కర్నూల్ ఎమ్మెల్యేలు, మహబూబ్ నగర్ డిప్యూటీ మేయర్ ప్రత్యేక సమావేశమయ్యారు. కే ఎల్ ఐ కాలువ నుండి వెలికిచర్ల గ్రామానికి సాగునీరు వెళ్లే కాల్వకు సంబంధించిన పరిహారం చెల్లిస్తామని చెప్పి గత ప్రభుత్వం చెల్లించకపోవడంతో కాల్వ తవ్వడం వల్ల భూమిని కోల్పోయి మోసపోయిన రైతులు కాలువలను పూడ్చి చేశారు. ఈ విధంగా భూములు కోల్పోయిన రైతుల భాగాలను మరియు రైతులకు పడుతున్న ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని వీరంతా కొంతమంది నాయకులు సమావేశమై చర్చించారు. ఈ సమావేశంలో దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి (జిఎంఆర్), నాగర్ కర్నూల్ ఎమ్మెల్యే రాజేష్ రెడ్డి, మహబూబ్ నగర్ డిప్యూటీ మేజర్ ఎం. సురేందర్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు కేఎల్ఐ క కాలువ నుండి వెల్కిచర్ల గ్రామానికి సాగునీరు వెళ్లే కాల్వ వల్ల భూమిని కోల్పోతున్న రైతుల ఇబ్బందులను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి నష్టపరిహారం చెల్లిస్తామని హామీ ఇవ్వడం జరిగింది. ఇట్టి ప్రకటన పట్ల రైతులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా తమ సమస్యపై చర్య తీసుకొని ఇరిగేషన్ అధికారులు మరియు ఎమ్మెల్యేలు, డిప్యూటీ మేయర్ సమావేశం నిర్వహించి సమస్య పరిష్కారానికి కృషి చేయడంతో దేవరకద్ర ఎమ్మెల్యే జిఎంఆర్ కు ఆ గ్రామస్తులు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో భూత్పూర్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కేశిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

---

# రైతు సహకార సంఘాల ఎన్నికలు నిర్వహించాలి

- బీజేపీ మేడ్చల్ జిల్లా ఉపాధ్యక్షుడు గౌరారం జగన్‌గౌడ్

**జయభేరి, మేడ్చల్ :**



రైతు సహకార సంఘాలకు ఎన్నికలు నిర్వహించకుండా నామినేషన్ల ద్వారా డైరెక్టర్లు, చైర్మన్‌లు, వైస్ చైర్మన్‌లను నియమించడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని బీజేపీ మేడ్చల్ జిల్లా ఉపాధ్యక్షుడు ఎల్లంపేట్ గౌరారం జగన్‌గౌడ్ విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికలకు దూరంగా ఉండి రైతుల ఓటు హక్కును హరిస్తోందని ఆరోపించారు. రైతులు తమ ప్రతినిధులను ఎన్నుకునే అవకాశాన్ని ప్రభుత్వం దూరం చేస్తోందని, ఎన్నికల్లో ఓటమి భయంతోనే నామినేషన్ల ద్వారా పదవుల పంపకానికి పాల్పడుతోందని ఆయన పేర్కొన్నారు. రైతు సహకార సంఘాలు రాజకీయ పునరావాస కేంద్రాలు కావని, అవి రైతుల సంస్థలని ప్రభుత్వం గుర్తించాలని సూచించారు. రైతుల హక్కులను కాలరాస్తూ ప్రజాస్వామ్య విలువలను దెబ్బతీసే చర్యలను వెంటనే నిలిపివేయాలని డిమాండ్ చేశారు. నామినేషన్ల ద్వారా చేపట్టిన నియామకాలను రద్దు చేసి, రాష్ట్రంలోని అన్ని రైతు సహకార సంఘాలకు స్వేచ్ఛాయుతంగా, పారదర్శకంగా ఎన్నికలు నిర్వహించాలని కోరారు. రైతులు, విద్యార్థులు, యువత, నిరుద్యోగులు, మహిళలు తదితర వర్గాల విశ్వాసాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం కోల్పోయిందని, ప్రజా వ్యతిరేక నిర్ణయాలతో ముందుకు సాగుతోందని విమర్శించారు. ప్రజాస్వామ్యాన్ని దెబ్బతీసిన ప్రభుత్వానికి రానున్న ఎన్నికల్లో ప్రజలే తగిన తీర్పు ఇస్తారని జగన్‌గౌడ్ పేర్కొన్నారు.

---

## సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ చేసిన కాంగ్రెస్ పార్టీ నాయకులు

**జయభేరి, సైదాపూర్ :**



వెన్నంపల్లి గ్రామంలో రాష్ట్ర రవాణా &బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ సహకారంతో సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ చేసిన కాంగ్రెస్ పార్టీ నాయకులు. ఈ సందర్భంగా వెన్నంపల్లి గ్రామంలోని తంగళ్ళపల్లి రాజమ్మ 35000 సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు మంత్రి సహకారంతో మంజూరు కాగా గురువారం రోజున అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు షాడా కొండల్ రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ దొంత సుధాకర్, మాజీ జెడ్పిటిసి గుండారం శ్రీనివాస్, మాజీ సింగల్ చైర్మన్ సారబుడ్ల రాజిరెడ్డి, మాజీ ఎంపిటిసి పరకాల రమేష్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు మిట్టపల్లి కిష్టయ్య, కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు మారుపాక తిరుపతి, గుజ్జులపల్లె గ్రామ శాఖ అధ్యక్షులు కరుణాకర్, గౌడ గాని కిషన్ రావు, దాసరపు సందీప్, తంగేళ్ల పల్లి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# హరీష్ వ్యూహాత్మక మౌనమేనా..



జయభేరి, హైదరాబాద్, జూలై 16 :

తెలంగాణ రాజకీయాల్లో ఏ క్షణంలోనైనా తనే ముందుండి ప్రత్యర్థులపై వ్యతిరేక దాడి చేయడమే తప్ప, ఎప్పుడూ రక్షణాత్మక ధోరణిలో రాజకీయాలు చేసే అలవాటు లేని బలమైన నాయకుడు తన్నీరు హరీష్‌రావు దీనికి ప్రధాన కారణం సుదీర్ఘ రాజకీయ ప్రస్థానంలో ఆయనపై పెద్దగా అవినీతి మరకలు లేకపోవడమే. గతంలో ఆయనపై వచ్చిన విమర్శలన్నీ కేవలం రాజకీయ కోణంలో చేసినవే తప్ప, పక్కా ఆధారాలతో ఆయన్ను ఇరకాటంలో పెట్టే స్థాయి ఆరోపణలు ఇప్పటి వరకు రాలేదు. కానీ, ప్రస్తుతం హరీష్ రావు తన రాజకీయ జీవితంలోనే మొదటి సారిగా సమాధానం చెప్పుకోవాల్సిన సంకట స్థితిలో పడ్డారు. ఈ వివాదానికి కేంద్ర బిందువు హరీష్‌రావు సతీమణి యాజమాన్యంలోని మిల్చీ మిల్క్ డైరీ బ్రాండ్. ఈ కంపెనీ మార్కెట్‌లో సాధారణ ప్రజలకు పంపిణీ చేసే వాటా చాలా పరిమితంగా ఉన్నప్పటికీ.. హైదరాబాద్‌లోని బడా కార్పొరేట్ ఆసుపత్రులు, ప్రముఖ విద్యాసంస్థలు, కాలేజీలకే అత్యధికంగా పాలను సరఫరా చేస్తుందనే ప్రచారం సాగుతోంది. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో అధికార బలాన్ని ఉపయోగించి, సదరు ఆంధ్రప్రదేశ్‌కు చెందిన కార్పొరేట్ విద్యాసంస్థలను, ఆసుపత్రులను బెదిరించి బలవంతంగా ఈ బ్రాండ్ పాలను కొనుగోలు చేయించారనే తీవ్రమైన ఆరోపణలు ఇప్పుడు తెరపైకి వచ్చాయి. ఈ వ్యవహారంపై కల్వకుంట్ల కవితతో పాటు ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి కూడా నేరుగా ఇవే ఆరోపణలు గుప్పించడంతో ఈ అంశానికి రాజకీయంగా మరింత ప్రాధాన్యత సంతరించుకుంది. హరీష్ రావు కుటుంబ ప్రయోజనాల కోసం అధికార దుర్వినియోగానికి పాల్పడ్డారంటూ కాంగ్రెస్ శ్రేణులు సోషల్ మీడియా వేదికగా పెద్ద ఎత్తున ప్రచారాన్ని ముమ్మరం చేశాయి. ఈ ఆరోపణలు ఇలా సాగుతుండగానే, ఊహించని విధంగా మిల్చీ మిల్క్ అధికారిక వెబ్‌సైట్ హఠాత్తుగా ఇంటర్నెట్ నుండి డౌన్ కావడం ఈ వివాదాన్ని మరింత పెంచింది.వెబ్‌సైట్ డౌన్ చేయడానికి అఫీషియల్ క్లైంట్స్ పేజీలో ఉన్న బడా విద్యాసంస్థల లోగోలు, పేర్లను కొందరు స్క్రీన్ షాట్లు తీసి సోషల్ మీడియాలో విపరీతంగా వైరల్ చేయడమేనని తెలుస్తోంది. ఈ స్క్రీన్ షాట్లు నెట్టింట వైరల్ కావడంతో, హరీష్ రావు క్యాంప్‌లో కొంత కంగారు మొదలైందనే అభిప్రాయం రాజకీయ వర్గాల్లో వ్యక్తమవుతోంది. నిజంగానే అక్రమాలు జరగకపోతే వెబ్‌సైట్‌ను ఎందుకు బ్లాక్ చేయాల్సి వచ్చిందనే ప్రశ్నలను ప్రత్యర్థులు బలంగా సంధిస్తున్నారు. అయితే, తన రాజకీయ జీవితంలో ఎంతటి పెద్ద సంక్షోభాలనైనా సమర్థవంతంగా ఎదుర్కొన్న హరీష్‌రావు.. ఇంతవరకు ఈ మిల్చీ మిల్క్ వివాదంపై నేరుగా ఎక్కడా స్పందించలేదు. సాధారణంగా తనపై చిన్న విమర్శ వచ్చినా గణాంకాలతో సహా తిప్పికొట్టే హరీష్, ఈ ఫ్యామిలీ బిజినెస్ వివాదంలో వ్యూహాత్మక మౌనం వహించడం వెనుక ఉన్న కారణాలపై రకరకాల ఊహాగానాలు వ్యక్తమవుతున్నాయి. కానీ ప్రస్తుత తరుణంలో ఆయన ఈ అంశంపై గట్టిగా, పక్కా ఆధారాలతో స్పందించాల్సిన అవసరం కనిపిస్తోంది.రాబోయే రోజుల్లో హరీష్ రావు కనుక ఈ ఆరోపణలను బలంగా తిప్పికొట్టి తన వాదనను ప్రజల ముందు ఉంచగలిగితే ఈ వివాదానికి బ్రేక్ పడే అవకాశం ఉంటుంది. అలా కాకుండా ఈ మౌనాన్ని ఇలాగే కొనసాగిస్తే, అధికార కాంగ్రెస్ పార్టీ ఈ అంశాన్ని ఒక బలమైన పొలిటికల్ అస్త్రంగా మలచుకుని, ఎల్లప్పుడూ క్లీన్ ఇమేజ్‌తో ఉండే హరీష్‌రావును రాజకీయంగా కార్నర్ చేస్తూనే ఉండే ప్రమాదం ఉంది. ఏదేమైనా, ఎప్పుడూ డిఫెన్స్‌లో పడనని చెప్పుకునే హరీష్ రావుకు ఈ డైరీ వివాదం ఒక పెద్ద పరీక్షగా మారిందనడంలో ఎలాంటి సందేహం లేదని భావిస్తున్నారు.



## ఎస్సీ, ఎస్టీ బాధితులకు సత్వర న్యాయం అందించాలి

- భీమిలి సీఐ దివాకర్ యాదవ్‌కు విజిలెన్స్ కమిటీ విజ్ఞప్తి
- నూతన బాధ్యతలు స్వీకరించిన సిఐని ఘనంగా సత్కరించిన డివిఎంసి సభ్యులు

జయభేరి, పరవాడ:

సామాజిక వివక్షలో భాగంగా కుల దూషణ, దాడులు, హత్యలు, అత్యాచారాలు, ఆస్తులపై దురాక్రమణ వంటి చట్టపరమైన సమస్యలు ఎదుర్కొంటున్న ఎస్సీ, ఎస్టీ వర్గాలకు చట్టప్రకారం సత్వరమే న్యాయం చేయాలని డిస్ట్రిక్ట్ విజిలెన్స్ మెంబర్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం.డి. రాజు, మెంబర్ ఎం. శ్వేతా కుమారి, భీమ్ సేన వార్ నాయకులు బాలకృష్ణ యెద్దు కోరారు. విశాఖ భీమిలి పోలీస్ స్టేషన్‌లో సీఐ దివాకర్ యాదవ్‌ను మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించి వినతిపత్రం సమర్పించారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ స్థానిక ఎస్సీ, ఎస్టీలకు పోలీసులు ఫ్రెండ్లీ పోలీసింగ్ ద్వారా ఎల్లప్పుడూ అందుబాటులో ఉండాలని కోరారు. పోలీస్ స్టేషన్‌లో పెండింగ్‌లో ఉన్న ఎస్సీ, ఎస్టీ కేసులపై తక్షణమే స్పందించి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని,బాధితులకు త్వరితగతిన న్యాయం అందేలా చూడాలని సీఐని అభ్యర్థించారు.ఈ కార్యక్రమంలో ప్రతినిధులు రూబెన్ పాల్, జగన్మోహన్ నాయుడు, రవి పాల్ తదితరులు పాల్గొన్నారు.

## బాధితుడికి ఎమ్మెల్యే సోదరుడి ఆర్థిక సహాయం



జయభేరి, దేవరకద్ర :

మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గం పరిధిలోని చిన్నచింత కుంట మండలం దమగ్నాపూర్ లో గురువారం ప్రమాదంలో గాయపడిన కృష్ణయ్యను దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి (జిఎంఆర్) సోదరుడు జి.భాస్కర్ రెడ్డి పరామర్శించారు. అలాగే ఆయనకు ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి ఆదేశానుసారం ఆర్థిక సహాయాన్ని కూడా అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## యాదవ సంఘం నాయకులకు ఆర్థిక సహాయం

- ఎమ్మెల్యే సోదరుడు



జయభేరి, దేవరకద్ర :

మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గ పరిధిలోని చిన్నచింతకుంట మండలం దమగ్నాపూర్ లో ఈనెల 21న నిర్వహించే పోచమ్మ అమ్మవారి పండుగ సందర్భంగా యాదవ సంఘం నాయకులకు గురువారం దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి (జిఎంఆర్) ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి ఆదేశానుసారం భాస్కర్ రెడ్డి యాదవ సంఘం నాయకులకు ముందస్తుగా పండుగ శుభాకాంక్షలు తెలిపారు. దీంతి భాస్కర్ రెడ్డికి యాదవ సంఘం నాయకులు కృతజ్ఞతలు తెలిపారు. ఆయన చేస్తున్న సేవలకు కొనియాడి అభినందించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## చెంగిచర్ల డిపోలో క్లెయిమ్ చేయని కార్గో పార్సిళ్లకు బహిరంగ వేలం

- డిపో మేనేజర్ ఎస్. స్వాతి

జయభేరి, చెంగిచర్ల, జూలై 16:

తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (TGSRTC) చెంగిచర్ల డిపో పరిధిలో సుదీర్ఘ కాలంగా నిలిచిపోయిన కార్గో మరియు పార్సిళ్లకు బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు డిపో మేనేజర్ శ్రీమతి ఎస్. స్వాతి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 18వ తేదీ (శనివారం) మధ్యాహ్నం 2:00 గంటల నుండి సాయంత్రం 5:00 గంటల వరకు చెంగిచర్ల డిపో గేటు ఆవరణలో ఈ వేలం పాట జరగనుంది. 50 శాతం ధరకే సొంతం చేసుకునే అవకాశం ఉన్నట్లు తెలిపారు. గతేడాది జులై 2025 నుండి మే 2026 వరకు వినియోగదారులు బుక్ చేసి, డిపోకు చేరుకున్నప్పటికీ తిరిగి తీసుకెళ్లని పార్సిళ్లను ఈ వేలంలో ఉంచనున్నారు. సదరు పార్సిళ్ల యజమానులకు ఫోన్ల ద్వారా సమాచారం అందించినప్పటికీ, వారు వాటిని డెలివరీ తీసుకోవడంలో విఫలమవడంతో సంస్థ ఈ నిర్ణయం తీసుకుంది. వేలంలో ఉంచే ప్రతి పార్సిల్‌ను దాని అసలు షిప్‌మెంట్ విలువ మీద 50 శాతం రాయితీ (ఆఫర్) ధరకే ప్రారంభ వేలం పాటగా నిర్ణయించారు. వేలం నిర్వహించు స్థలం చెంగిచర్ల డిపో గేటు ఆవరణ తేదీ 18072026 సమయం మధ్యాహ్నం 02:00 గంటల నుండి సాయంత్రం 05:00 గంటల వరకు వస్తువుల కాలపరిమితి జులై 2025 నుండి మే 2026 మధ్య నిలిచిపోయిన పార్సిళ్లు తెలంగాణతో పాటు అంతర రాష్ట్రాలకు నిరంతరం కార్గో సర్వీసుల ద్వారా ప్రజా సేవ అందిస్తున్న TGSRTC, ఈ వేలం ప్రక్రియను పారదర్శకంగా నిర్వహిస్తోందని డిపో మేనేజర్ పేర్కొన్నారు. వ్యాపారస్థులు, ప్రయాణీకులు మరియు ఆసక్తి గల ప్రజలందరూ ఈ సువర్ణ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని, వేలంలో పాల్గొని తక్కువ ధరకే పార్సిళ్లను సొంతం చేసుకోవాలని ఆమె కోరారు.

## అభివృద్ధి కార్యక్రమాలను మరింత వేగవంతం చేయడానికి కృషి

- జోన్ కమిషనర్ రాధిక గుప్త(ఐఏఎస్)ని కలిసిన ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి



జయభేరి, ఉప్పల్ :

ఉప్పల్ నియోజకవర్గంలోని వివిధ అభివృద్ధి పనుల కోసం అవసరమైన నిధులను మంజూరు చేయాలని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి జోన్ కమిషనర్ రాధిక గుప్త (ఐఏఎస్)ని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలో పెండింగ్‌లో ఉన్న రోడ్లు,పారిశుద్ధ్యం, వీధి దీపాలు తదితర మౌలిక వసతుల అభివృద్ధి పనులకు తగిన నిధులు కేటాయించి, పనులను వేగవంతం చేయాలని ఎమ్మెల్యే కోరారు. ఉప్పల్ నియోజకవర్గ ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటూ, అభివృద్ధి కార్యక్రమాలను మరింత వేగవంతం చేయడానికి కృషి చేస్తున్నామని ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో BRS పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## SIR సహాయక కేంద్రాన్ని సందర్శించిన ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి



జయభేరి, ఉప్పల్ :

ఉప్పల్ నియోజకవర్గం పరిధిలోని వెంకట్ రెడ్డి నగర్ డివిజన్ సాయి రామ్ స్కూల్ వద్ద ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (SIR) కార్యక్రమాన్ని ప్రజలకు మరింత చేరువ చేయడానికి BRS పార్టీ వెంకట్ రెడ్డి నగర్ డివిజన్ యువ నాయకుడు లవంగు నవీన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన SIR సహాయక కేంద్రం (Help Desk) ను ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి సందర్శించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సహాయక కేంద్రంలో అందిస్తున్న సేవలను పరిశీలించి, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఓటరు నమోదు, పేరు సవరణ, చిరునామా మార్పు, పేరు తొలగింపు తదితర దరఖాస్తుల విషయంలో పూర్తి సహాయ సహకారాలు అందించాలని నిర్వాహకులకు సూచించారు. ప్రతి అర్హుడైన ఓటరు తన వివరాలను సరిచూసుకుని అవసరమైన మార్పులు చేసుకోవాలని, SIR ప్రక్రియను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో BRS పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## SIR ప్రచార రథాన్ని ప్రారంభించిన ఉప్పల్

- ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి



జయభేరి, కాప్రా :

కాప్రా డివిజన్ లో BRS పార్టీ నాయకులు బైరీ నవీన్ గౌడ్ ఆధ్వర్యంలో ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (SIR) కార్యక్రమంపై ప్రజలకు విస్తృత అవగాహన కల్పించేందుకు ఏర్పాటు చేసిన SIR ప్రచార రథాన్ని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ప్రతి అర్హుడైన ఓటరు తన పేరు ఓటరు జాబితాలో సక్రమంగా నమోదై ఉందో లేదో తప్పకుండా పరిశీలించుకోవాలని సూచించారు. పేరు నమోదు, మార్పులు, చిరునామా సవరణలు, తొలగింపులు వంటి అవసరమైన సేవలను గడువులోగా పూర్తి చేసుకోవాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ప్రజలు ఎలాంటి అపోహలకు గురికాకుండా, ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం తమ ఓటు హక్కును పరిరక్షించుకునేలా అవగాహన కల్పించడమే ఈ ప్రచార రథం ముఖ్య ఉద్దేశమని ఎమ్మెల్యే తెలిపారు. ప్రతి కుటుంబాన్ని చేరుకుని ఓటరు జాబితా సవరణ ప్రక్రియపై వివరాలు తెలియజేస్తూ ప్రజలను చైతన్యపరిచేందుకు ఈ ప్రచార రథం పనిచేస్తుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో కాప్రా డివిజన్ BRS పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



## ఓటు హక్కు పరిరక్షణకు 'ఎస్ఐఆర్' హెల్ప్ డెస్క్ సేవలు

- రామన్నగారి రాఘవేందర్ గౌడ్

జయభేరి, మేడ్చల్:

ప్రజాస్వామ్య పరిరక్షణలో భాగంగా ప్రతి ఓటరుకు అండగా నిలవాలనే లక్ష్యంతో ఆర్ ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రత్యేక ఎస్ఐఆర్ (SIR) హెల్ప్ డెస్క్ నిర్వహిస్తున్నట్లు ఆ సంస్థ అధినేత, సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ మేడ్చల్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు రామన్నగారి రాఘవేందర్ గౌడ్ తెలిపారు. మేడ్చల్ డివిజన్ పరిధిలో గత 11 రోజులుగా కొనసాగుతున్న ఈ హెల్ప్ డెస్క్ ద్వారా ప్రజలకు ఎస్ఐఆర్ నమోదు ప్రక్రియపై అవగాహన కల్పించడంతో పాటు దరఖాస్తు ఫారాలు నింపడం, అవసరమైన పత్రాలపై మార్గనిర్దేశం చేయడం వంటి సేవలను ఆర్ ఆర్ ఫౌండేషన్ వాలంటీర్లు అందిస్తున్నారని చెప్పారు. ఈ సందర్భంగా రాఘవేందర్ గౌడ్ మాట్లాడుతూ, ప్రతి పౌరుడు తన ఓటు హక్కును పరిరక్షించుకోవడం బాధ్యత అని పేర్కొన్నారు. ఇంకా ఎస్ఐఆర్ నమోదు పూర్తి చేయని వారు వెంటనే ఈ అవకాశాన్ని వినియోగించుకుని నమోదు ప్రక్రియను పూర్తి చేసుకోవాలని కోరారు. ఓటర్ల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన ఈ హెల్ప్ డెస్క్ సేవలను ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

## మేడారం పనులపై మంత్రి సీతక్క సమీక్ష



జయభేరి, ములుగు :

గురువారం నాడు మేడారం హరిత హోటల్లో మేడారం అభివృద్ధి పనుల పురోగతిపై సమీక్ష సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో మంత్రి దనసరి అనసూయ సీతక్క, జిల్లా కలెక్టర్ బోర్డడే హేమంత్ సహదేవరావు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా చేపట్టిన అభివృద్ధి పనుల పురోగతి, పెండింగ్ పనులు, మౌలిక సదుపాయాల కల్పన, భక్తులకు మెరుగైన సౌకర్యాల ఏర్పాటుపై సంబంధిత శాఖల అధికారులతో సమీక్షించి, పనులను నిర్ణీత గడువులో నాణ్యతతో మంత్రి పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ సుధీర్ రామ్నాథ్ కేకన్, ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి లెనిన్ వత్సల్ టోప్పో, జిల్లా అటవీ అధికారి వికాస్ మీనా, గ్రంధాలయ సంస్థ చైర్మన్ బానోతు రవిచందర్, మార్కెట్ కమిటీ చైర్పర్సన్ రేగ కళ్యాణి,జిల్లా అధికారులు, స్థానిక సర్పంచ్, పూజారులు, ప్రజా ప్రతినిధులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# వేరొకరి ఇయర్ బడ్స్ వాడుతున్నారా.?

**ఇది తెలిస్తే ఇంకోసారి ఆ జోలికి వెళ్లరు..**

నేటి డిజిటల్ యుగంలో స్మార్ట్ ఫోన్ వాడే ప్రతి ఒక్కరి వద్ద బ్లూటూత్ ఇయర్‌ఫోన్స్ లేదా ఇయర్ బడ్స్ కచ్చితంగా ఉంటున్నాయి. ప్రయాణాల్లో ఉన్నప్పుడైనా, ఆఫీసుల్లో పనిచేస్తున్నప్పుడైనా పాటలు వినడానికి లేదా ఫోన్ మాట్లాడటానికి ఇవి ఎంతో సౌకర్యవంతంగా ఉపయోగపడతాయి.
అయితే, చాలామంది తమ ఇయర్ బడ్స్ అందుబాటులో లేనప్పుడు లేదా స్నేహితులు పంపిన ఏదైనా ఆడియో వినడానికి వారి ఇయర్ బడ్స్‌ను మార్చుకుని వాడుతుంటారు. ఇలా ఇతరుల బ్లూటూత్ ఇయర్‌ఫోన్స్ లేదా ఇయర్ బడ్స్ వాడటం అనేది అత్యంత ప్రమాదకరమని, ఇది నేరుగా చెవి ఇన్ఫెక్షన్లను కొనితెచ్చుకోవడమేనని వైద్యులు తీవ్రంగా హెచ్చరిస్తున్నారు.
వైద్య నిపుణుల అభిప్రాయం ప్రకారం.. ఒకరి ఇయర్ బడ్స్‌ను మరొకరు పంచుకోవడం అనేది తీవ్రమైన అపరిశుభ్రమైన అలవాటు. ఇది ఎంత అసహ్యకరమైన అలవాటంటే, వేరొకరు వేసుకుని చెమట పట్టిన సాక్సులను మనం వేసుకోవడం కంటే కూడా ఘోరమైనదని వైద్యులు పోల్చి చెబుతున్నారు. సాధారణంగా ప్రతి ఒక్కరి చెవి లోపలి భాగంలో కొంత శాతం సహజమైన బ్యాక్టీరియా, వ్యాక్స్, ఫంగస్ ఉంటాయి. ఇవి ఆయా వ్యక్తుల శరీర తత్వానికి అనుగుణంగా ఉంటాయి. అయితే, మనం ఇతరుల ఇయర్ బడ్స్‌ను మన చెవిలో పెట్టుకున్నప్పుడు, వారి చెవిలో ఉండే ఆ ప్రమాదకరమైన బ్యాక్టీరియా, ఫంగస్ కణాలు ఆ ఇయర్ బడ్స్ ద్వారా నేరుగా మన చెవిలోకి ప్రవేశిస్తాయి.
ఇలా ఇతరుల బ్యాక్టీరియా మన చెవిలో చేరడం వల్ల చెవి లోపలి భాగంలో తీవ్రమైన అలర్జీలు, ఇన్ఫెక్షన్లు దారితీస్తాయి. దీనివల్ల చెవిలో భరించలేనంత తీవ్రమైన దురద, విపరీతమైన నొప్పి, చెవిలో నుంచి పసుపు రంగు ద్రవాలు కారడం లాంటి సమస్యలు తలెత్తుతాయి. సమస్య మరింత తీవ్రమైతే అది వినికిడి లోపానికి కూడా దారితీసే ప్రమాదం ఉందని వైద్యులు అప్రమత్తం చేస్తున్నారు. అందుకే పర్సనల్ హైజీన్లో భాగంగా ఇయర్ బడ్స్ అనేవి కేవలం మీ వ్యక్తిగత అవసరాలకు మాత్రమే పరిమితం కావాలి. 'మీ ఇయర్ బడ్స్‌ను ఎవరికీ ఇవ్వకండి, ఇతరులవి మీరు అస్సలు వాడకండి' అని నిపుణులు సూచిస్తున్నారు. ఒకవేళ తప్పనిసరి పరిస్థితుల్లో వేరొకరిది వాడాల్సి వచ్చినా లేదా మీ ఇయర్ బడ్స్‌ని ఇతరులు వాడినా.. వాటిని తిరిగి ఉపయోగించే ముందు శానిటైజర్ లిక్విడ్ లేదా ఆల్కహాల్ వైప్స్‌తో పూర్తిగా క్లీన్ చేసిన తర్వాతే వాడటం సురక్షితం.



# ఫుల్ ప్రొటీన్ తో అందరికి నచ్చే ఎనర్జీ డ్రింక్..

**రోజూ ఉదయాన్నే తీసుకున్నారంటే తిరుగులేని ఆరోగ్యం మీ సొంతం!**

ఇటీవలి కాలంలో మఖానా ఒక సూపర్ ఫుడ్‌గా ప్రాచుర్యం పొందింది. వీటిని కేవలం విడిగా వేయించుకుని తినడమే కాకుండా, పాలల్లో నానబెట్టి తీసుకోవడం వల్ల శరీరానికి రెట్టింపు పోషకాలు అందుతాయని ఆరోగ్య నిపుణులు చెప్తున్నారు. పాలల్లో నానబెట్టిన మఖానా తినడం వల్ల కలిగే ప్రధాన ఆరోగ్య ప్రయోజనాలు, వాటిని ఎలా తీసుకోవాలో ఇప్పుడు తప్పక తెలుసుకోవాలి.
నేటి కాలంలో ప్రజలు ఆరోగ్యంగా ఉండటానికి రకరకాల ఆహారాలు తింటారు. కొందరు తమ ఆహారంలో మఖానాను కూడా చేర్చుకుంటారు. ఇటీవలి కాలంలో మఖానా..తామర గింజలు లేదా ఫాక్స్ నట్స్ అనేది ఒక సూపర్ ఫుడ్‌గా ప్రాచుర్యం పొందింది. ఆరోగ్యానికి పోషకమైన మఖానా, సహజంగా శరీరాన్ని ఆరోగ్యంగా, బలంగా ఉంచడానికి సహాయపడుతుంది. అందుకే మఖానాను పోషకాల గనిగా పరిగణిస్తారు. మఖానా తినడం వల్ల బలహీనమైన ఎముకలకు శక్తి లభిస్తుంది. వీటిని కేవలం విడిగా వేయించుకుని తినడమే కాకుండా, పాలల్లో నానబెట్టి తీసుకోవడం వల్ల శరీరానికి రెట్టింపు పోషకాలు అందుతాయని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. పాలల్లో నానబెట్టిన మఖానా తినడం వల్ల కలిగే ప్రధాన ఆరోగ్య ప్రయోజనాలు ఇవే..

**ఎముకలు, కండరాల బలం:**
మఖానా, పాలు రెండింటిలోనూ కాల్షియం పుష్కలంగా ఉంటుంది. ఇది ఎముకలను, పళ్ళను దృఢంగా ఉంచడమే కాకుండా ఆస్టియోపోరోసిస్ (ఎముకల బలహీనత) ప్రమాదాన్ని తగ్గిస్తుంది. అలాగే, ఇందులోని హైప్రోటీన్ కండరాల పెరుగుదలకు, కణజాలాల మరమ్మత్తుకు ఎంతగానో తోడ్పడుతుంది.

**రోగనిరోధక శక్తి పెరుగుతుంది:**
మఖానాలో యాంటీఆక్సిడెంట్లు అధికంగా ఉంటాయి. ఇవి పాలలోని అవసరమైన విటమిన్లు, ఖనిజాలతో కలిసి శరీర రోగనిరోధక వ్యవస్థను బలోపేతం చేస్తాయి. దీనివల్ల సీజనల్ వ్యాధులు, ఇన్ఫెక్షన్ల బారిన పడకుండా శరీరం సురక్షితంగా ఉంటుంది.

**గుండె ఆరోగ్యానికి మేలు:**
మఖానాలో కొలెస్ట్రాల్, సోడియం శాతాలు చాలా తక్కువగా ఉంటాయి. ఇది రక్తపోటును (బిపి) అదుపులో ఉంచడానికి సహాయపడుతుంది. పాలతో కలిసి ఇది గుండె పనితీరును మెరుగుపరిచి, గుండె జబ్బుల ముప్పును తగ్గిస్తుంది.

**జీర్ణక్రియ మెరుగుపడుతుంది:**
మఖానాలో ఉండే పీచు పదార్థం (ఫైబర్) మలబద్ధకం సమస్యను నివారిస్తుంది. పాలు జీర్ణవ్యవస్థను ప్రశాంతంగా ఉంచి, ప్రేగుల కదలికలను క్రమబద్ధీకరిస్తాయి. ఇది శరీర మెటబాలిజంను కూడా పెంచుతుంది.

**బరువు తగ్గడానికి, చర్మ సౌందర్యానికి:**
ఈ ఆహారం తిన్న తర్వాత ఎక్కువ సమయం ఆకలి వేయకుండా కడుపు నిండుగా ఉన్న అనుభూతి కలుగుతుంది. దీనివల్ల అనవసరమైన క్రేవింగ్స్ తగ్గి, బరువు సులభంగా అదుపులోకి వస్తుంది. అలాగే, మఖానాలోని యాంటీ ఏజింగ్ గుణాలు, పాలలోని హైడ్రేటింగ్ గుణాలు కలిసి ముడతలను తగ్గించి, చర్మాన్ని ప్రకాశవంతంగా, యవ్వనంగా ఉంచుతాయి.

**కిడ్నీల ఆరోగ్యానికి రక్షణ:**
మఖానా సహజ డిటాక్సిఫైయర్‌గా పనిచేసి శరీరంలోని వ్యర్థాలను బయటకు పంపుతుంది. పాలు శరీరంలో ఎలక్ట్రోలైట్ సమతుల్యతను కాపాడుతూ, మూత్రపిండాలు (కిడ్నీలు) ఆరోగ్యంగా పనిచేసేలా చేస్తాయి. పోషకాల గని అయిన ఈ నానబెట్టిన మఖానాను మీ రోజువారీ ఆహారంలో చేర్చుకోవడం ద్వారా పూర్తి ఆరోగ్యాన్ని పెంపొందించుకోవచ్చు.



# నిద్రలేచిన తర్వాత ఎలా గడపాలో తెలుసా?

**హైదరాబాద్‌లోని అపోలో హాస్పిటల్స్‌కు చెందిన న్యూరాలజిస్ట్ డాక్టర్ సుధీర్ కుమార్ ఏం చెబుతున్నారంటే.. ఉదయం వేళల్లో కొన్ని ఆరోగ్యకరమైన అలవాట్లను పాటించడం ద్వారా శరీరంలోని సిర్కాడియన్ రిథమ్‌ను సమతుల్యం చేసుకోవచ్చు. దీంతో శరీరం సహజమైన శక్తిని పొందడమే కాకుండా, మెరుగైన నిద్ర కూడా లభిస్తుంది.**

**ఉదయాన్నే సూర్యరశ్మిని ఆస్వాదించండి**
నిద్రలేచిన 30 నుంచి 60 నిమిషాలలోపు కనీసం 10 నుంచి 20 నిమిషాల పాటు సహజ సూర్య కాంతిలో గడపాలని నిపుణులు సూచిస్తున్నారు. ఇది శరీరంలో కార్టిసాల్ హార్మోన్ సమతుల్యంగా విడుదల కావడానికి సహాయపడుతుంది. ఫలితంగా రోజంతా ఉత్సాహంగా, చురుకుగా ఉండగలుగుతారు.

**నిద్రలేవగానే కాఫీకి దూరంగా ఉండండి**
చాలామంది నిద్రలేవగానే టీ లేదా కాఫీ తాగే అలవాటు కలిగి ఉంటారు. అయితే శరీరం సహజంగా మేల్కొనే ప్రక్రియకు సమయం ఇవ్వడం అవసరం. అందుకే కనీసం 60 నుంచి 90 నిమిషాల తర్వాత కాఫీ లేదా టీ తీసుకోవడం మంచిదని వైద్యులు సూచిస్తున్నారు.

**ముందుగా నీళ్లు తాగండి**
రాత్రంతా నిద్రపోవడం వల్ల శరీరంలో కొంత మేర నీటి లోపం ఏర్పడుతుంది. అందువల్ల ఉదయం లేవగానే సుమారు 500 మిల్లీలీటర్ల నీరు తాగడం ద్వారా శరీరానికి తేమను అందించవచ్చు. ఇది జీవక్రియలను చురుకుగా చేయడంలో కూడా సహాయపడుతుంది.

**తేలికపాటి వ్యాయామం చేయండి**
ఉదయం కొద్దిసేపు నడవడం, ఒళ్ళు విరుచుకోవడం లేదా తేలికపాటి స్ట్రెచింగ్ చేయడం ద్వారా శరీరం చురుకుదనాన్ని పొందుతుంది. ఇది మెదడుకు రోజు ప్రారంభమైందనే సంకేతాన్ని పంపి ఏకాగ్రత, శక్తిని పెంచుతుంది. నిద్రలేవగానే సోషల్ మీడియా, మెసేజ్‌లు లేదా ఈమెయిల్స్ చూడడం వల్ల ఒత్తిడి పెరిగే అవకాశం ఉంది. అందువల్ల ఉదయం మొదటి గంటలో మొబైల్ వినియోగాన్ని వీలైనంత వరకు తగ్గించడం మంచిది.

**స్నూజ్ బటన్ నొక్కకండి**
అలారం మోగిన ప్రతిసారి స్నూజ్ బటన్ నొక్కడం వల్ల మెదడు మళ్లీ నిద్రలోకి వెళ్లే ప్రయత్నం చేస్తుంది. దీంతో అలసట, నీరసం పెరిగే అవకాశం ఉంటుంది. కాబట్టి అలారం మోగగానే లేవడం ఉత్తమం.

**పోషకాలు ఉన్న అల్పాహారం తీసుకోండి**
ఉదయం అల్పాహారం రోజంతా శక్తిని అందించే ముఖ్యమైన భోజనం. అధిక చక్కెర కలిగిన ఆహారాలకు బదులుగా ప్రోటీన్లు, ఆరోగ్యకరమైన కొవ్వులు ఉన్న ఆహారాన్ని తీసుకోవడం వల్ల శరీరానికి అవసరమైన శక్తి అందుతుంది.


**ఆరోగ్యకరమైన ఉదయమే ఆరోగ్యకరమైన రోజుకు పునాది**
ఉదయం వేళల్లో ఈ సాధారణ అలవాట్లను పాటించడం ద్వారా శరీర ఆరోగ్యం మెరుగుపడటమే కాకుండా, మానసిక ప్రశాంతత, ఏకాగ్రత, మంచి నిద్ర కూడా పొందవచ్చు. చిన్న మార్పులతో పెద్ద ఆరోగ్య ప్రయోజనాలు పొందాలంటే ప్రతి రోజును ఆరోగ్యకరమైన ఉదయంతో ప్రారంభించడం అవసరం.



# 10 ఏళ్ల తర్వాత ఎంట్రీ..



తక్కువ సినిమాలతో క్రేజ్ తెచ్చుకొని ఆతర్వాత సినిమాలకు, నటనకు గుడ్ బై చెప్పిన వారు చాలా మంది ఉన్నారు. ఇదిలా ఉంటే ఇప్పుడు మనం మాట్లాడుకునే హీరోయిన్ కూడా ఒకానొక సమయంలో వరుస సినిమాలతో మంచి క్రేజ్ సొంతం చేసుకుంది. 2016వరకు సినిమాలు చేసిన ఆమె సడన్ గా సినిమాలనుంచి దూరం అయ్యింది. ఇక ఇప్పుడు రీ ఎంట్రీ ఇవ్వనుంది. ఆమె ఎవరో తెలుసా.? ఆ ముద్దుగుమ్మ ఎవరో కాదు.. ఒకప్పుడు కుర్రాళ్లను కవ్వించిన ఇషా చావ్లా.. యంగ్ హీరో ఆది సాయి కుమార్ హీరోగా నటించిన ప్రేమ కావాలి అనే సినిమాతో హీరోయిన్ గా పరిచయం అయ్యింది ఇషాచావ్లా. ప్రేమ కావాలి సినిమా హిట్ కావడంతో ఇషా చావ్లాకు యూత్‌లో మంచి ఫాలోయింగ్ ఏర్పడింది. ఇండస్ట్రీలోకి వచ్చిన తక్కువ సమయంలోనే ఇండస్ట్రీలో క్లిక్ అయ్యింది ఈ . దీంతో ఆ తర్వాత తెలుగులో ఈ బ్యూటీకి వరుస ఆఫర్స్ వచ్చాయి. మొత్తం ఐదు తెలుగు సినిమాలు.. అలాగే ఒక కన్నడ సినిమాలో అలరించింది. అయితే ప్రేమ కావాలి తర్వాత ఆ స్థాయిలో మరో హిట్ అందుకోలేకపోయింది ఈ ముద్దుగుమ్మ. దీంతో ఈ బ్యూటీకి ఆఫర్స్ తగ్గిపోయాయి. అలా మెల్లగా సినిమాలకు దూరం అయ్యింది. సోషల్ మీడియలోనే అభిమానులను కవ్వించింది. ఇక ఇన్నాళ్లు సినిమాలకు బ్రేక్ తీసుకున్న ఈ అమ్మడు ఇప్పుడు మళ్లీ రీఎంట్రీ ఇస్తుంది. అది కూడా మెగాస్టార్ చిరంజీవి సినిమాతో. చిరంజీవి హీరోగా నటిస్తున్న విశ్వంభర సినిమాతో ఈ ముద్దుగుమ్మ రీఎంట్రీ ఇస్తుందని తెలుస్తుంది. 2014 నుంచి తెలుగులో ఒక్క సినిమా కూడా చేయని ఇషా చావ్లా.. ఇప్పుడు మెగాస్టార్ చిరంజీవి సినిమాతో కంబ్యాక్ ఇస్తుంది. కానీ ఈ సినిమా షూటింగ్ ఆలస్యం అవుతూ వస్తుంది. అన్ని అనుకున్నట్టు జరిగిఉంటే ఈపాటికి సినిమా విడుదలై ఉండేది.



# ‘లెనిన్’ అంటే కమ్యూనిజం కాదు..

## టైటిల్ వెనుక ఉన్న అసలు కథ వెల్లడించిన అఖిల్!

అక్కినేని అఖిల్ కథానాయకుడిగా నటిస్తున్న సరికొత్త రస్టిక్ యాక్షన్ ఎంటర్‌టైనర్ ‘లెనిన్’ చిత్రం జూలై 10న అత్యంత భారీ స్థాయిలో ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. అయితే ఈ సినిమా టైటిల్ అనౌన్స్ చేసినప్పటి నుంచి ప్రేక్షకుల్లో తీవ్ర ఆసక్తితో పాటు పలు రకాల అనుమానాలు వ్యక్తమవుతున్న సంగతి తెలిసిందే. ‘లెనిన్’ అనే పేరు వినగానే ఇది రాజకీయ నేపథ్యమున్న సినిమానో లేదా కమ్యూనిజం సిద్ధాంతాల గురించిన కథో అయి ఉంటుందని సినీ వర్గాల్లో గట్టి ప్రచారం సాగింది. అయితే తాజాగా ఈ టైటిల్ వెనుక ఉన్న అసలు రహస్యాన్ని హీరో అఖిల్ స్వయంగా వెల్లడించి అందరి అనుమానాలకు పూర్తి క్లారిటీ ఇచ్చారు. ఈ సినిమా టైటిల్‌కు ఎలాంటి పొలిటికల్ కనెక్టివిటీ లేదని, ఇది పూర్తిగా ఒక కల్పిత కథ ఆధారంగా తెరకెక్కిన చిత్రమని అఖిల్ స్పష్టం చేశారు. దర్శకుడు నందు గారి స్వగ్రామమైన రాయలసీమ ప్రాంతానికి తాను వెళ్ళినప్పుడు అక్కడ ‘లెనిన్ బాబు’ అనే ఒక వ్యక్తిని కలిశానని, ఆ ప్రాంతంలో కమ్యూనిస్ట్ మూలాలు లేదా ఆ సిద్ధాంతాల పట్ల ఆకర్షితులైన కుటుంబాలు తమ పిల్లలకు లెనిన్, స్టాలిన్ వంటి పేర్లు పెట్టుకోవడం చాలా సాధారణమని ఆయన వివరించారు. అలా రాయలసీమలో ఇది చాలా కామన్ పేరుగా మారిపోయిందని అఖిల్ పేర్కొన్నారు. దర్శకుడు నందుకు ఈ పేరు పట్ల ఉన్న ప్రత్యేక ఇష్టం, గౌరవంతోనే ఈ టైటిల్‌ను ఎంచుకున్నట్లు అఖిల్ తెలిపారు. కథ ప్రకారం సమాజంలో ఒక బలమైన శక్తిగా ఎదిగి, సహజ సిద్ధమైన నాయకత్వ లక్షణాలతో ప్రజలను నడిపించే ఒక పవర్‌ఫుల్ కుర్రాడి పాత్రకు ఈ పేరు సరిపోతుందని భావించి ‘లెనిన్’ అని ఫిక్స్ చేశారు. ఈ పేరు కేవలం కమ్యూనిజానికి మాత్రమే కాకుండా ఒక అద్భుతమైన లీడర్‌షిప్‌కు ప్రతీకగా నిలుస్తుందని చిత్ర బృందం నమ్ముతోంది. భాగ్యశ్రీ బోర్సే కథానాయికగా నటిస్తున్న ఈ చిత్రం రాయలసీమ పల్లెటూరి నేపథ్యంలో సాగే ఇంటెన్స్ యాక్షన్ లవ్ డ్రామాగా రూపొందింది. అఖిల్ తన కెరీర్‌లోనే అత్యంత మాస్ లుక్‌లో, పక్కా సీమ యాసతో అలరించనున్నారు. మురళి కిషోర్ అబ్బూరి దర్శకత్వంలో ఎంతో ప్రతిష్టాత్మకంగా తెరకెక్కిన ఈ చిత్రంపై టాలీవుడ్‌లో భారీ అంచనాలు నెలకొన్నాయి. సరికొత్త కథాంశంతో, అఖిల్ సరికొత్త మేకోవర్‌తో రాబోతున్న ఈ పవర్‌ఫుల్ యాక్షన్ ఎంటర్‌టైనర్ జూలై 10న థియేటర్లలో సందడి చేయడానికి సర్వం సిద్ధమైంది.

# దసరా కానుకగా ‘విశ్వంభర’



‘మన శంకర వరప్రసాద్’తో టాలీవుడ్ రీజనల్ రికార్డులన్నింటినీ తిరగరాశారు అగ్ర కథానాయకుడు చిరంజీవి. తదుపరి చిత్రం ‘విశ్వంభర’ కోసం ఆయన అభిమానులంతా ఆతృతగా ఎదురు చూస్తున్న విషయం తెలిసిందే. వీఎఫ్ఎక్స్ ప్రాధాన్యత ఎక్కువగా ఉన్న సినిమా కావడంతో, నాణ్యమైన వీఎఫ్ఎక్స్ కోసం చిత్రబృందం ఎక్కువ సమయం తీసుకోవడం జరిగింది. ప్రపంచప్రఖ్యాత వీఎఫ్ఎక్స్ నిపుణులు ఈ సినిమాకు పనిచేశారు. ఈ సినిమాకు సంబంధించిన అన్ని కార్యక్రమాలూ పూర్తయినట్టు సమాచారం. అందుకే ఎట్టకేలకు రిలీజ్ డేట్‌ని మేకర్స్ లాక్ చేశారు. దసరా కానుకగా అక్టోబర్ 16న ‘విశ్వంభర’ థియేటర్లలో విడుదల కానున్నది. మరణానంతర లోకాల నేపథ్యంలో దేవతలు, మానవుల మధ్య జరిగే సంఘర్షణే ప్రధాన ఇతివృత్తంగా ఈ సినిమా ఉంటుందని ఇన్‌సైడ్ టాక్. విజువల్ వండర్‌గా దర్శకుడు వశిష్ట మల్లిడి ఈ చిత్రాన్ని తెరకెక్కించినట్టు మేకర్స్ చెబుతున్నారు. త్రిష కథానాయికగా నటించిన ఈచిత్రంలో అషికా రంగనాథ్, కునాల్ కపూర్ కీలక పాత్రధారులు. యూవీ క్రియేషన్స్ పతాకంపై ఈ చిత్రం రూపొందిన విషయం తెలిసిందే. ఎం.ఎం.కీరవాణి సంగీత దర్శకుడు.

# బాబా నిరాళా మళ్లీ వస్తున్నాడు..



బాలీవుడ్ ప్రముఖ నటుడు బాబీ డియోల్ ప్రస్తుతం చేతి నిండా సినిమాలతో బిజీ బిజీగా ఉంటున్నారు. హిందీతో పాటు దక్షిణాది సినిమాల్లోనూ ఆయన నటిస్తున్నారు. ముఖ్యంగా విలన్ పాత్రలకు ఆయన ఇప్పుడు కేరాఫ్ అడ్రస్ గా మారిపోయాడు. ఇదిలా ఉంటే బాబీ డియోల్ నటించిన సూపర్ హిట్ వెబ్ సిరీస్ ‘ఆశ్రమ్’ నాల్గవ సీజన్ త్వరలో రానుంది. అందులో ఆయన బాబా నిరాళా పాత్రలో అద్భుతంగా నటించారు. ‘ఆశ్రమ్’ వెబ్ సిరీస్ బాబీ డియోల్‌కు సరికొత్త గుర్తింపును ఇచ్చింది.

ఈ వెబ్ సిరీస్‌లో అతని పాత్రపై వివాదాలు వచ్చినా యాక్టింగ్ పరంగా ప్రశంసలు అందుకున్నాడు బాబీ. ప్రకాష్ ఝా ఈ సస్పెన్స్ క్రైమ్ థ్రిల్లర్ సిరీస్ కు దర్శకత్వం వహించారు. మూఢనమ్మకాలు, రాజకీయాలు, డ్రగ్స్ దందా, అమ్మాయిలను బలవంతంగా లోబర్చుకోవడం వంటి అంశాలు చుట్టూ ఈ సిరీస్ కథ తిరుగుతుంది. ఇందులో భక్తి పేరుతో ప్రజలను మోసం చేస్తున్న నకిలీ బాబా నిరాళాగా కనిపించి సినీ ప్రియులను ఆకట్టుకున్నారు బాబీ డియోల్.

ఆశ్రమ్ మొదటి భాగం 2020 ఆగస్టు 28న విడుదలైంది. రెండవ సీజన్ 2020 నవంబర్ 11న స్ట్రీమింగ్ కు రాగా, మూడవ సీజన్ 2022 జూన్ 3న వచ్చింది. ఇప్పుడున్న సమాచారం ప్రకారం, బాబీ డియోల్ నటించిన ‘ఆశ్రమ్’ వెబ్ సిరీస్ నాలుగో సీజన్ షూటింగ్ 2026 ఆగస్టు మధ్యలో ప్రారంభం కానుంది. ఈ నాలుగో సీజన్‌లో ప్రకాష్ ఝా, బాబీ డియోల్ మరోసారి కనిపించనున్నారు. అలాగే ఈ వెబ్ సిరీస్‌లో అదితి పోహంకర్, చందన్ రాయ్ సన్యాల్ కూడా కనిపించనున్నారు. బాబీ డియోల్ మొదటి మూడు సీజన్లలోనూ ‘బాబా నిరాలా’ పాత్రను పోషించారు. నివేదికల ప్రకారం, బాబీ మూడవ సీజన్ కోసం 1 నుంచి 4 కోట్ల రూపాయల పారితోషికం తీసుకున్నారు. ఈ పారితోషికం చాలా తక్కువగా అనిపిస్తుంది. కానీ ఈ సిరీస్ కారణంగానే బాబీ డియోల్ కు గ్రాండ్ రీఎంట్రీ లభించింది.



# మూడింతల పారితోషికం

హిందీ చిత్రసీమలో ప్రతిభావంతురాలైన కథానాయికగా గుర్తింపును తెచ్చుకుంది శ్రద్ధాకపూర్. ప్రస్తుతం ఆమె ప్రసిద్ధ మరాఠీ నృత్యకారిణి, తమాషా కళాకారిణి విఠాబాయి జీవిత కథ ఆధారంగా రూపొందిస్తున్న ‘ఈథ’ చిత్రంలో నటిస్తున్న విషయం తెలిసిందే. పాన్ ఇండియా స్థాయిలో భారీ అంచనాలు నెలకొన్న ఈ సినిమా ఆగస్ట్ 28న విడుదలకానుంది. ఇదిలావుండగా ఈ సినిమాకు శ్రద్ధాకపూర్ దాదాపు 15కోట్ల రెమ్యునరేషన్ తీసుకున్నదని తెలిసింది. రెండేళ్ల క్రితం చేసిన ‘స్త్రీ2’ చిత్రం కోసం ఆమె కేవలం ఐదుకోట్ల పారితోషికాన్ని మాత్రమే తీసుకుందట. అయితే ‘ఈథ’ సినిమాలో పాత్రపరమైన సవాళ్లతో పాటు దాదాపు ఏడాది పాటు డేట్స్ కేటాయించాల్సి రావడంతో నిర్మాతలు ఆమెకు 15 కోట్ల భారీ మొత్తాన్ని అందించారని చెబుతున్నారు.

Printed and Published, Editor & Owned by **MOTHE RAGHU THIRUPATHI REDDY**, Printed at **Sri Muktheswara Publications**, Plot No. 31, Mallikarjuna Nagar Colony, Sagar Ring Road, Bairamal Guda, Hyderabad-500079, Dist. Rangareddy, Telangana. Published at # 2-20-2/71/C, Ganesh Nagar, Uppal, Hydrebad, Medchal-Malkajgiri-500 039. **Cell: 9391 544 889**. **PRGI No: TGTEL/25/A0314**. email: **jayabherinews@gmail.com, www.jayabheridaily.com**